ANN తెలుగు

Follow: @ANNTELUGU

13-08-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 220 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏపీ సిఎంఓలో ఆధిపత్యపోరు
# బాబు మార్క్ లేని టీమ్

**అమరావతి, మహా :** ఉమ్మడి రాష్ట్రానికి, విభజిత రాష్ట్రానికి పలుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు పరిపాలనలో ఎందుకో తడబడుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అపారఅనుభవం ఉన్న ఆయన పాలనలో తనదైన మార్కును చూపించలేకపోతున్నారు. ప్రభుత్వ పరంగా చేయాల్సిన పనులు చేస్తున్నా..ప్రభుత్వానికి రావాల్సిన మైలేజ్ రావడం లేదనే భావన వ్యక్తం అవుతోంది. ఒకవైపు రాష్ట్రానికి వరదలా పెట్టుబడులు తీసుకువస్తున్నా, సంక్షేమ పాలన అందిస్తున్నా.. ఎక్కడో ఏదో లోపం అన్నట్లు ప్రతివాళ్లూ చంద్రబాబు పాలనపై పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ సానుభూతిపరులు ఎవరూ ఈ పాలనపై సంతృప్తికరంగా లేరు. ముఖ్యమంత్రి ఆదేశించినా ఒక్క నిర్ణయం కూడా సకాలంలో అమలు కావడం లేదని, ఎక్కే గడపా, దిగే గడపా అన్నట్లు ఉందనే విమర్శలు అధికార, పార్టీ, రాజకీయ, పాత్రికేయవర్గాల్లో వ్యక్తం అవుతోంది. ఎందుకు ఇలా జరుగుతుందనే దానిపై రకరకాలైన విశ్లేషణలు

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్



## కేసీఆర్‌కు మరోసారి నోటీసులు

- నోటీసులు పక్కాగా అందజేయాలని కోర్టు ఆదేశం
- సెప్టెంబర్ 9న తదుపరి విచారణ

03



## డీలిమిటేషన్ వద్దు

- తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తీర్మానం
- డీలిమిటేషన్ తో నష్టం జరుగుతుందన్న దళపతి

03



## హర్ముజ్ మా సొంతం

- దగ్గరకొస్తే పేల్చేస్తాం
- ఇరాన్ పై ట్రంప్ ఫైర్

03



మరో పార్టీ టికెట్‌పై పోటీ చేస్తే

## సభ్యత్వం వదులుకున్నట్లే

02

- దానం అనర్హతపై హైకోర్టులో కీలక వాదనలు



## నేరాల రూపం మారింది పోలీసింగ్ మారాలి

**ఏపీ సీఎం చంద్రబాబు**

**అమరావతి, మహా :** మారుతున్న కాలంతో పాటు నేరాల స్వరూపం, స్వభావం పూర్తిగా మారిపోయాయని, అందుకు అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేరం జరిగిన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో కీలక ఆధారాలు చేజారిపోకుండా చూడటమే నేర నియంత్రణలో మొదటి విజయమని ఆయన పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నాడు సచివాలయం నుంచి రాష్ట్ర డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,650 మంది అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ స్థాయి వరకు ఒకేసారి ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీసుల కీర్తి దేశవ్యాప్తంగా మార్మోగాలని, అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలంగాణలో ఎదురులేని కాంగ్రెస్!



### సోషల్ మీడియాలోనే బీఆర్ఎస్.. ఫీల్డ్ లో డెడ్

- బిజెపికి రేవంత్ ను ఎదుర్కొనే సీన్ లేదు
- కేసీఆర్ తెరవెనుక సహకారం లేకుండానే బీజేపీకి 8 ఎంపీ సీట్లు దక్కాయా?
- అప్పటి నుండే బీఆర్ఎస్ డౌన్ ఫాల్
- చర్చకు దారితీసిన ప్రముఖుల విశ్లేషణలు



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కాంగ్రెస్‌కు ఎదురులేదు. సీఎం రేవంత్ రెడ్డిని ఎదుర్కొనే సీన్ ఇపుడున్న పార్టీలకు లేదంటూ.. ప్రముఖ జర్నలిస్ట్, జమీన్ రైతు సంపాదకులు డోలేంద్ర ప్రసాద్ సంచలన విశ్లేషణ చేశారు. తెలంగాణ రాజకీయాలు, భవిష్యత్తుపై తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లుగా విశ్లేషించారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని కనుసన్నల్లో శాసించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటు ఎన్నికల్లో కనీసం ఉనికి చాటుకోలేక కుప్పకూలిపోయింది. అదే సమయంలో, క్షేత్రస్థాయి బలం లేని నియోజకవర్గాల్లో సైతం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్యంగా పుంజుకుని ఏకంగా ఎనిమిది స్థానాలను కొల్లగొట్టి సెన్సేషన్ క్రియేట్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల నాటి గాలిని కొనసాగిస్తూ

మిగతా 2వ పేజీలో



## గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవాలి

### ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ నుంచి సాధ్యమైనంత మేర ఎత్తిపోతలు చేపట్టాలి : సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మహా :** గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకుని రాష్ట్రంలోని సాగు భూములకు సాధ్యమైనంత ఎక్కువగా నీరందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి అందుబాటులో ఉన్న నీటిని పూర్తిస్థాయిలో ఎత్తిపోసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చిన్నచిన్న సాంకేతిక సమస్యలు, పరిపాలనా ఇబ్బందుల కారణంగా నీటి ఎత్తిపోతలకు ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో కలిసి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల నీటి లభ్యత, ఎత్తిపోతల సామర్థ్యం, పెండింగ్ పనులు, ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసం తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా తొమ్మిది పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశంలో వివరించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి మరింత ఎక్కువ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నందున అక్కడ ఉన్న చిన్నచిన్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల వ్యవస్థలు పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మరోవైపు పలు ప్రాజెక్టుల పరిధిలో ఒకట్రెండు

మిగతా 2వ పేజీలో

## సీఎం రేవంత్ సీరియస్..!

- రూ. 13,399 కోట్ల 'సీఎంఆర్' కుంభకోణం.
- డిఫాల్ట్ మిల్లుల జప్తు.
- ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తారా.
- జప్తు చేసిన మిల్లులన్నీ నేరుగా మహిళా సంఘాలకే

03

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అరెస్ట్

02

- బెంగళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగానే

# రాజన్న ఆలయ అభివృద్ధి

- శృంగేరి పీఠాధిపతులతో ఆలయ ప్రతినిధులు బృందం భేటీ
- వేములవాడలో ఇప్పటికే రూ.250కోట్ల పనులు పూర్తి
- ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక శ్రద్ధ

02





కిమ్స్ ఆసుపత్రిలో

## ఎన్టీఆర్‌కు విజయవంతంగా సర్జరీ పూర్తి

**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ అగ్రహీరో జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం నాడు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఆయన భుజానికి వైద్యులు విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ సర్జరీని నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆయన ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ఇటీవల జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో వైద్యులు ఆయనకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే, గాయం నుంచి వేగంగా, పూర్తిగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సిఫార్సు చేయడంతో నేడు ఈ ఆపరేషన్ నిర్వహించారు.ఈ శస్త్రచికిత్స నుంచి ఎన్టీఆర్ పూర్తిగా కోలుకుని, తిరిగి తన వృత్తిపరమైన పనుల్లో నిమగ్నం కావడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు.

## ఎవిఎస్ఎన్ పురస్కార గ్రహీత వాడపల్లి ఈవోకు ఘనసన్మానం

- దేవాదాయశాఖలో చక్రధరరావు సేవలకు ప్రశంసలు
- వాడపల్లి ఈవోకు ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి పురస్కారం



02

## నాణేనికి మరో వైపు చూపిస్తా

- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతా
- ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా వైసీపీ గొంతు నొక్కుతున్నారు
- మండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచన
- డీఎస్సీ కుంభకోణంపై ఆధారాలతో పోరాడామని జగన్ వెల్లడి
- విద్యా పథకాల బకాయిలపై మండలిలో పోరాడాలని జగన్ ఆదేశం

02





# గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవాలి

( మొదటి పేజీ తరువాయి )

గ్రామాలు, కొద్దిపాటి వ్యవసాయ భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ పెండింగ్ పరిహారాన్ని త్వరితగతిన చెల్లించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, భూముల పరిహారం, పునరావాసానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.

ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయినప్పటికీ పరిహారం లేదా పునరావాసానికి సంబంధించిన చిన్నచిన్న అంశాలు పెండింగ్‌లో ఉండటం వల్ల నీటి నిల్వకు ఇబ్బందులు ఏర్పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు ముందుగా పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ పనులను వేగంగా పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపే అవకాశం ఉంటుందని తెలిపారు. అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతులు, క్షేత్రస్థాయి సమన్వయంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంచే అంశంపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రస్తుత నీటి లభ్యత, భవిష్యత్ అవసరాలు, ఎత్తిపోతల సామర్థ్యం, విద్యుత్ వినియోగం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించి తదుపరి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై చర్చ**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల భద్రత అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. జాతీయ డ్యామ్ భద్రత సంస్థ సూచనల మేరకే ఈ మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ పలు లోపాలు ఉన్నట్లు పరిశీలనల్లో తేలిందని తెలిపారు. బ్యారేజీల భద్రత విషయంలో జాతీయ డ్యామ్ భద్రత సంస్థ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు సంబంధించి సాంకేతిక అంశాలపై జాతీయ డ్యామ్ భద్రత సంస్థతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. నిపుణుల సూచనలకు అనుగుణంగానే నీటి నిల్వ, నిర్వహణ, పునరుద్ధరణకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గోదావరి జలాల లభ్యతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు ప్రాజెక్టుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఒకవైపు అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోసి సాగుకు ఉపయోగించుకోవడం, మరోవైపు ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాస సమస్యలను పరిష్కరించడం, భద్రతాపరమైన లోపాలున్న ప్రాజెక్టుల్లో నిపుణుల సూచనల మేరకు ముందుకు సాగడం ద్వారా నీటి పారుదల రంగాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

# తెలంగాణలో ఎదురులేని కాంగ్రెస్!

( మొదటి పేజీ తరువాయి )



కాంగ్రెస్ పార్టీ ఎనిమిది ఎంపీ స్థానాలను కైవసం చేసుకుని తెలంగాణలో తనకు ఇక ఎదురేలేదని నిరూపించుకుంది. అయితే, ఈ చరిత్రాత్మక ఫలితాల వెనుక ఇప్పుడు ఓ మహా రాజకీయ వ్యూహం దాగి ఉందన్న చర్చ ఇపుడు ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ పతనం కేవలం ప్రజాగ్రహమా? లేక కమలం పార్టీని గెలిపించడానికి గులాబీ బాస్ కేసీఆర్ స్వయంగా రచించిన ఓట్ల బదిలీ వ్యూహమా? అన్న దానిపై ఎవరి విశ్లేషణలు వారు చేస్తున్నా.. తాజాగా డోలేంద్రప్రసాద్ తెలుగువన్ ఎండి రవిశంకర్ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి సహకరించి సూసైడ్ చేసుకుందని, భయపెట్టారా.. బతిమిలాడారా? బేరం జరిగిందా అనేది తనకు తెలియదని కానీ బీఆర్ఎస్ ఒక్కటీ గెలవకుండా బిజెపి 8 గెలవడం కేసీఆర్ సహకరించకుండా జరిగే పనికాదని ఆయన తేల్చారు.

**ఇదే శాపం**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 37 శాతం ఓటు బ్యాంకుతో బలమైన పోటీ ఇచ్చిన బీఆర్ఎస్, కేవలం ఆరు నెలలు తిరిగే సరికి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 16.68 శాతానికి పడిపోవడం ఒక రాజకీయ అద్భుతమనే చెప్పాలి. ఒక పార్టీ తమ సంప్రదాయ ఓటు బ్యాంకును సగానికి పైగా కోల్పోవడం సాధారణ విషయం కాదు. సరిగ్గా ఇదే సమయంలో, అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 14 శాతం వద్ద ఆగిపోయిన బీజేపీ, పార్లమెంటు ఎన్నికల నాటికి ఏకంగా 35.19 శాతానికి పైగా ఓట్లను రాబట్టడం అతిపెద్ద సెన్సేషన్. కాంగ్రెస్ ఓటు శాతం కూడా 40 శాతానికి పైగా పెరిగినప్పటికీ, గులాబీ శిబిరం నుంచి గల్లంతైన భారీ ఓటు బ్యాంకు నేరుగా కమలం ఖాతాలోనే జమ అయిందన్నది పక్కా పోలింగ్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ గణాంకాలే ఇప్పుడు బీఆర్ఎస్‌బీజేపీ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని విశ్లేషకులు ఘంటాపథంగా చెబుతున్నారు. కేసీఆర్ సహకారం లేకుండా బీజేపీ ఎనిమిది ఎంపీ సీట్లు గెలవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదన్నది కాంగ్రెస్ నేతలు చెబుతున్నా తాజా విశ్లేషణలు మళ్లీ చర్చకు దారితీశాయి.

**తాజా పరిస్థితి ఇదే**

తెలంగాణలో రేవంత్ రెడ్డి బలపడ్డారని, బీఆర్ఎస్ పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సోషల్ మీడియాలో, మీడియాలో బలంగా ఉంటున్నారని.. ఫీల్డ్ లో క్యాడర్ పార్టీని పట్టించుకోవడంలేదని డోలేంద్రప్రసాద్ విశ్లేషించారు. బిజెపి 8ఎంపీ సీట్లు గెలిచినా, కాంగ్రెస్‌ను, రేవంత్ రెడ్డిని ఎదుర్కొనేస్థాయిలో లేదన్నారు. ఏపీలో కాంగ్రెస్ డెడ్ అయిందని, తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌కు తిరుగులేదన్నారు.

# మరో పార్టీ టికెట్‌పై పోటీ చేస్తే .. సభ్యత్వం వదులుకున్నట్లే

**దానం అనర్హతపై హైకోర్టులో కీలక వాదనలు**



**హైదరాబాద్ , మహా :** బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి, ఆ తర్వాత మరో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం అంటే సదరు వ్యక్తి తన మాతృ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లేనని పిటిషనర్లు హైకోర్టులో బలంగా వాదించారు. అధికారికంగా పార్టీకి రాజీనామా లేఖ సమర్పించకపోయినా, వేరే పార్టీ టికెట్ పై పోటీ చేయడం, ఆ పార్టీ తరఫున ప్రచారం చేయడం వంటి చర్యలను అనర్హత వేటుకు ప్రాతిపదికగా తీసుకోవాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హతను నిర్ణయించేటప్పుడు స్పీకర్ అధికార పరిధికి కొన్ని పరిమితులు ఉంటాయని, శాసనసభలో పార్టీ బలం తగ్గిందా లేదా ప్రభుత్వ స్థిరత్వం దెబ్బతిన్నదా అన్న అంశాలతో సంబంధం లేకుండా.. సదరు సభ్యుడు పార్టీని వీడారా లేదా అన్నదే ప్రధానంగా పరిశీలించాలని విన్నవించారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద తదితరులతో పాటు బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పదో షెడ్యూల్ ఉద్దేశం కేవలం సభలో ఫ్లోర్ మేనేజ్‌మెంట్ కాదని, ప్రజలు ఇచ్చిన రాజకీయ తీర్పును ఫిరాయింపుల ద్వారా నిర్వీర్యం కాకుండా చూడటమేనని స్పష్టం చేశారు. సభ్యత్వాన్ని వదులుకోవడం అనేది కేవలం సభ లోపలే జరగాలన్న నియమం ఎక్కడా లేదని, సభ వెలుపల చేసే పనులు కూడా అనర్హత పరిధిలోకి వస్తాయన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఉదాహరణను కోర్టు దృష్టికి తెస్తూ.. ఆయన బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన గెజిట్, ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన గెజిట్‌తో పాటు ఆయన స్వయంగా సమర్పించిన ఫారం 26 అఫిడవిట్‌లను ఆధారాలుగా సమర్పించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన వ్యక్తి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడాన్ని పార్టీ మార్పుగా పరిగణించాలని, 2019లో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఈ అంశాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. స్పీకర్ తన ఉత్తర్వుల్లో చట్టంలో లేని షరతులను చేర్చారని, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు.



# మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అరెస్ట్

**బెంగళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**హైదరాబాద్, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత రేగా కాంతారావును పోలీసులు బెంగళూరులో అరెస్ట్ చేశారు. మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడటంతో పాటు ఆర్థికంగా మోసగించారనే ఆరోపణలతో ఆయనపై హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. బాధితురాలు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా రేగా కాంతారావుపై పంజాగుట్ట పోలీసులు బీఎన్ఎస్ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.కాగా 2022లో ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూ సాకుతో రేగా కాంతారావు తనకు పరిచయమయ్యారని, ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ప్రైవేట్ ఫోటోలను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేశారని, అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి పేరుతో రూ.4 లక్షల వరకు నగదు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మొహం చాటేశారని బాధితురాలు పంజాగుట్ట పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. పంజాగుట్ట పోలీసుస్టేషన్ లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఇటీవలే రేగా కాంతారావు హైకోర్టును ఆశ్రయించారు. సదరు మహిళ తనపై తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేశారని, రాజకీయంగా, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయడానికేనని కుట్రపూరితంగా ఫిర్యాదు చేశారని ఆరోపించారు.



# నాణేనికి మరో వైపు చూపిస్తా

**తాడేపల్లి, మహా :** ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్ సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్ వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు.

# ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగానే రాజన్న ఆలయ అభివృద్ధి

- శృంగేరి పీఠాధిపతులతో ఆలయ ప్రతినిధులు బృందం భేటీ
- వేములవాడలో ఇప్పటికే రూ.250కోట్ల పనులు పూర్తి
- ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక శ్రద్ధ



**వేములవాడ, మహా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన రాజన్న ఆలయ అభివృద్ధి పై శృంగేరి పీఠాధిపతుల శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి, శ్రీశ్రీశ్రీ విధుశేఖర స్వామిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డి వేముల శ్రీనివాస్, ఎండోమెంట్ కమిషనర్ హనుమంత రావు, ధార్మిక అడ్వైజర్ గోవింద హరి, విటిడిఎ వైస్ చైర్మన్ గరిమ అగ్రవాల్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ ఇంచార్జ్ స్థాన చార్యులు ఉమేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు శరత్ శర్మ శృంగేరి పీఠం తెలంగాణ రాష్ట్ర బాధ్యులు వ్యాసోజుల రాధకృష్ణా శర్మలు కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధిని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తుండగా, సీఎం ఆదేశాలతో ముఖ్య బృందం పీఠాధిపతులను కలిసింది. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా గతంలో చెప్పినట్లుగానే యధావిధిగా గర్భాలయం,మహామండపం నిర్మిస్తుండగా, కొంత మంది గర్భాలయం, మహామండపంపై అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, రాజన్న భక్తులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని వారు సూచించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను ఆగమ శాస్త్రం, భక్తుల మనోభావాలకు అనుగుణంగా చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వేములవాడ ఆలయ అభివృద్ధి పనులపై వివరాలను తెలియజేసేందుకు శృంగేరి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారిని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆలయ అధికారులు, అర్చకులతో కలిసి ఆది శ్రీనివాస్ కలిశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన పనులు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నమూనాలు, ఫొటోలను పీఠాధిపతికి వివరించారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం సుమారు 2000 వేల కోట్ల నిధులు కేటాయించారని, గోదావరి పుష్కరాల కోసం 1000 కోట్లు మంజూరు చేశారని స్వామి వారికి వివరించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా గతంలో చెప్పినట్లుగానే గర్భాలయం, మహామండపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చడం లేదని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి రెండు వేల కోట్లకు పైచిలుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు..వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖతో పాటు అధికారులు, ఆలయ అర్చకులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.250 కోట్ల మేర నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం దాదాపు 55 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం గతంలో రూ.50 కోట్లు, అనంతరం రూ.100 కోట్లు, తాజాగా రూ.99.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. వేములవాడ ఆలయ గర్భాలయం, మహామండపాన్ని తొలగిస్తున్నారంటూ గత రెండు రోజులుగా కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని, ఈ అంశంపై భక్తుల్లో నెలకొన్న అనుమానాలను శృంగేరి పీఠాధిపతి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.గతంలో చెప్పినట్లుగానే గర్భాలయం ,మహామండపాన్ని యథావిధి ఉంటుందని తెలిపారు. 1973లో నిర్మించిన ప్రస్తుత శిఖరం, భవిష్యత్తులో బంగారు తాపడం చేసుకునే అవకాశం ఉండేలా శిలామయంగా శిఖర స్థాయిని మరింత పెంచే అంశాన్ని మాత్రమే పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ అంశంపై ఆగమ శాస్త్రం, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లామని శృంగేరి పీఠాధిపతి సూచించారని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనివెట్టి మండపాన్ని ఆధునికంగా నిర్మిస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. గతంలో రేకుల షెడ్డు ఉన్న ప్రాంతంలో 20 అడుగులు, 24 అడుగుల విభాగాలతో మండప నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.ఆలయ అభివృద్ధి పనులన్నింటినీ పరిశీలించిన శృంగేరి పీఠాధిపతి పనులు శుభప్రదంగా ఉన్నాయని, త్వరగా పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు.



# కేసీఆర్‌కు మరోసారి నోటీసులు

**సెప్టెంబర్ 9న తదుపరి విచారణ**

**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన వ్యవహారానికి సంబంధించిన కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంలో జారీ చేసిన నోటీసులు ఆయనకు అందలేదని తేలడంతో, ఈసారి నోటీసులను పక్కాగా అందజేసేలా తగిన చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది.

**ప్రైవేట్ ఫిర్యాదు.. విచారణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్**

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో నాణ్యతా లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు, ప్రజాధనం దుర్వినియోగం జరిగాయంటూ భూపాలపల్లికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి గతంలో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఇందులో బాధ్యులుగా పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు తగిన భూసాంకేతిక పరీక్షలు నిర్వహించలేదని, ఐపీసీలోని కుట్ర, మోసం సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అయితే, పిటిషనర్ రాజలింగమూర్తి మరణించినప్పటికీ ఈ న్యాయ ప్రక్రియను నిలిపివేయాల్సిన అవసరం లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేయడంతో కింది కోర్టులో విచారణకు మార్గం సుగమమైంది.



# ఎవెన్‌ఎన్ పురస్కార గ్రహీత వాడపల్లి ఈవోకు ఘనసన్మానం

**అన్నవరం, మహా :** ఎవెన్‌ఎన్ మీడియాగ్రూప్ ద్వారా ప్రతిష్టాత్మక మహా పురస్కారం అందుకున్న వాడపల్లి ఈవో నల్లం సూర్య చక్రధర రావును ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఎవెన్‌ఎన్ మీడియా గ్రూప్ ఆంధ్రప్రదేశ్ లో తొలిసారి నిర్వహించిన ప్రతిష్టాత్మక అవార్డుల వేడుకలో నల్లం చక్రధరరావు ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలకు ప్రతిష్టాత్మక అవార్డునివ్వగా, ఉద్యోగులు అభినందించారు. దేవాదాయశాఖలో చక్రధరరావు అంకితభావం, సేవను ఉద్యోగులు ప్రశంసించారు. విజయవాడ తాజ్ వివంటాలో మిరుమిట్లు గొలిపే వేదికపై జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ప్రముఖుల చేతులమీదుగా ఎవెన్‌ఎన్ మీడియా గ్రూప్ రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వర్షా లు**

**హైదరాబాద్, మహా :** వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక జారీ చేసింది. వాతావరణ శాఖ సూచన ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం, కోనసీమ, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, అనకాపల్లి జిల్లాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాల ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో రెండుమూడు రోజులు వాతావరణం మేఘావృతమై, తేమతో కూడి ఉంటుంది. ఉత్తరాంధ్రలో సాయంత్రం నుండి రాత్రి వరకు జల్లులు కురిసే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడుతుండగా, రాయలసీమలో చాలా వరకు పొడిగా ఉంటుంది. క్యుములోనింబస్ మేఘాల కారణంగా అకస్మాత్తుగా, స్వల్పకాలిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ అంతటా గంటకు 4060 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని ఐఎమ్‌డీ హెచ్చరించింది.తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, జనగాం, మహబూబాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో అడపాదడపా వర్షాలు కురిసే అవకాశం ఉండగా, అక్కడక్కడ కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. రాబోయే వారం రోజులు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## ఏపీ సీఎంఓలో ఆధిపత్యపోరు

# బాబు మార్క్ లేని టీమ్

(మొదటి పేజీ తరువాయి )

వెలువడుతున్నాయి. మిగతా సంగతి ఎలా ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన కార్యాలయాన్ని సరిగా ఏర్పాటు చేసుకోలేదనే విమర్శలు, ఆరోపణలు పార్టీ, రాజకీయ, సచివాలయ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి.2024లో కూటమి అఖండ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన తరువాత రవిచంద్ర అనే సీనియర్ ఐఏఎస్‌ను ఆయన తన కార్యాలయ ఇన్‌ఛార్జిగా నియమించుకున్నారు. రవిచంద్ర నిజాయితీపరుడు, నెమ్మదస్తుడు, నిగర్వి, పాలనానుభవం ఉన్న వ్యక్తి కావడంతో..మొదట్లో పాలన సులువుగానే జరిగింది. సిఎంఓలో రవిచంద్ర నియామకం సరైనదేనని, బీసీ వర్గానికి చెందిన ఆయనకు సముచిత స్థానం కల్పించారనే భావన వ్యక్తం అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఆయన పనిచేసుకుంటూ వెళ్లారు. అయితే..ఆయనపై కొన్నిపత్రికలు రాసిన వార్తలతో ఆయన మనస్థాపం చెందిన అక్కడి నుంచి తిరుమల తిరుపతిదేవస్థానానికి బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. ఆయన వెళ్లిపోయిన తరువాత సిఎంఓ పరిస్థితి మరింత దిగజారింది. అక్కడ ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు.ముఖ్యంగా సిఎంఓలో ఆధిపత్య ధోరణి సిఎంఓ పరువు తీస్తోంది. ఇద్దరు అధికారుల మధ్య జరుగుతున్న గొడవలను చూసి ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాలయమేనా..అనే ప్రశ్నలు పలువురి వద్ద నుంచి వస్తున్నాయి. వివాదాస్పద అధికారులకు పోస్టింగ్‌లు ఇప్పించే విషయంలో కానీ, సిఎం అపాయింట్ మెంట్ ల విషయంలో కానీ, మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకువచ్చే విజ్ఞప్తులను పరిష్కరించే విషయంలో కానీ సదరు సిఎంఓ అధికారులు సరిగా స్పందించడం లేదని, మొక్కుబడిగా పనిచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎవరూ ఇది తమ బాధ్యత అని, ముఖ్యమంత్రి తమను నమ్మి..బాధ్యతలు అప్పగించారని, ఆయన నమ్మకాన్ని నిలబెడదామనే ఆలోచన ఎవరికీ లేదు. ఎవరికి వారు..ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు, ఆరోపణలు జోరుగా వస్తున్నాయి. రవిచంద్ర తరువాత సిఎంఓ ఇన్‌ఛార్జిగా నియమితులైన విజయానంద్ కూడా అక్కడ పరిస్థితిని సరిదిద్దలేకపోయారనే మాట సర్వత్రా వినిపిస్తోంది. అంతే కాక ఆయన అనారోగ్యానికి గురికావడంతో.. ఇప్పుడు ఇద్దరు అధికారులే సిఎంఓ అంతా పెత్తనం చేస్తున్నారని, వారిలో వారే..పోటీకి దిగుతున్నారని, ఒకరిపై ఒకరు ఆధిపత్యం సాధించేందుకు యత్నిస్తూ..పనిచేసే వాతావరణాన్నిచెడగొడుతున్నారనే భావన వ్యక్తం అవుతోంది. మొత్తం మీద..సిఎంఓలో నెలకొన్న ఆధిపత్య పోరు..ప్రభుత్వ ప్రతిష్టను మసకబారుస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై చర్యలు తీసుకుని..సిఎంఓను దారిని పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రీల్స్ మోజులో పుస్తక పఠనాన్ని కోల్పోవద్దు

- **యువతలో లోతైన ఆలోచన పెరగాలంటే పుస్తకాలు చదవాలి.**
- **ప్రధాని నరేంద్ర మోదీ**



**ఢిల్లీ, మహా :** సామాజిక మాధ్యమాల ప్రభావంతో యువత పుస్తక పఠన అలవాటును కోల్పోవద్దని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. రీల్స్, తక్షణ వినోదం పెంచుతున్న స్వల్పకాలిక ఆలోచనా ధోరణి నుంచి యువత బయటపడాలని సూచించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'భారత గణతంత్ర విజయగాథ: నా జీవితం, నా పోరాటాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని.. పుస్తక పఠనం వల్ల మనిషి ఆలోచనా పరిధి విస్తరిస్తుందని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు.డిజిటల్ యుగంలో సెకన్ల వ్యవధిలో మారిపోయే దృశ్యాలు, చిన్నచిన్న వీడియోలు యువత దృష్టిని ఆకర్షిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. నిరంతరం ఇటువంటి తక్షణ వినోదానికే పరిమితమైతే ఒక అంశంపై ఎక్కువసేపు దృష్టి కేంద్రీకరించే సామర్థ్యం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. లోతుగా ఆలోచించడం, విషయాలను విశ్లేషించడం, ఒక అనుభవం నుంచి పాఠం నేర్చుకోవడం వంటి లక్షణాలను పుస్తక పఠనం పెంపొందిస్తుందని వివరించారు.మహనీయులు, ప్రముఖులు, దేశానికి సేవ చేసిన వ్యక్తుల జీవిత చరిత్రలు, ఆత్మకథలు యువతకు ఎంతో విలువైన పాఠాలను అందిస్తాయని ప్రధాని తెలిపారు. ఒక వ్యక్తి విజయాన్ని మాత్రమే కాకుండా, ఆ విజయానికి ముందు అతను ఎదుర్కొన్న కష్టాలు, వైఫల్యాలు, నిరాశలు, పోరాటాలను కూడా జీవిత చరిత్రల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఇతరుల జీవిత ప్రయాణాన్ని చదవడం ద్వారా తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే స్ఫూర్తి లభిస్తుందని చెప్పారు.ఆత్మకథలు ఒక వ్యక్తి జీవితానికి సంబంధించిన సంఘటనల సమాహారం మాత్రమే కాదని, ఒక కాలానికి సంబంధించిన సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలను అర్థం చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తాయని మోదీ వివరించారు. రామ్‌నాథ్ కోవింద్ జీవిత ప్రయాణంలో సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎదిగిన క్రమం యువతకు ప్రత్యేకమైన ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.పుస్తకాలు చదివే అలవాటు వ్యక్తిగత జ్ఞానాన్ని పెంచడమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతుందని ప్రధాని అన్నారు. పుస్తక పఠనం ద్వారా సహనం, ఏకాగ్రత, పరిశీలనా దృష్టి, విశ్లేషణా సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. సమాజంలోని వివిధ వర్గాల జీవితాలను, వారి సమస్యలను అర్థం చేసుకోవడానికి కూడా పుస్తకాలు ఒక వేదికగా నిలుస్తాయని చెప్పారు.సామాజిక మాధ్యమాలు సమాచారాన్ని వేగంగా అందించడంలో ఉపయోగపడుతున్నప్పటికీ, అవి పుస్తక పఠనానికి ప్రత్యామ్నాయం కాదని మోదీ సూచించారు. తక్షణ సమాచారం కోసం డిజిటల్ వేదికలను ఉపయోగించుకోవడంతో పాటు, లోతైన జ్ఞానం కోసం పుస్తకాలను చదవాలని యువతకు సూచించారు. రోజులో కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించుకోవడం జీవితంలో మంచి అలవాటుగా మారుతుందని చెప్పారు.దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, అందుకే వారికి కేవలం సమాచారమే కాకుండా జ్ఞానం, వివేకం, విలువలు అవసరమని ప్రధాని పేర్కొన్నారు. దేశానికి సేవ చేసిన మహనీయుల జీవితాలను చదవడం ద్వారా బాధ్యత, క్రమశిక్షణ, దేశభక్తి, సమాజం పట్ల నిబద్ధత వంటి విలువలను అలవరచుకోవచ్చన్నారు.రీల్స్ చూస్తూ సమయం గడపడం సులభమే అయినా, ఒక మంచి పుస్తకం చదివి దానిలోని ఆలోచనలను జీవితంలో ఆచరించడం మరింత విలువైనదని మోదీ సూచించారు. డిజిటల్ వినోదం మధ్యలోనూ పుస్తకాలకు స్థానం కల్పించాలని, యువత తమ పఠన అలవాటును నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలు వేగంతో పాటు లోతైన ఆలోచనను కూడా అలవరచుకున్నప్పుడే బలమైన సమాజాన్ని నిర్మించగలమని ప్రధాని పేర్కొన్నారు.

# న్నబిడ్డను కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని వేదన: హోంమంత్రి వంగలపూడి అనిత

- **విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా అకాల మరణం తీవ్రంగా కలచివేసింది**
- **ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పిన హోంమంత్రి**
- **డీసీపీ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించిన వంగలపూడి అనిత**



**విజయవాడ, మహా :** గుంటూరు జిల్లా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా (24) అకాల మరణం చెందడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలోని ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం నివాసానికి వెళ్లిన హోంమంత్రి అనిత ఆమెను, కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. కన్నబిడ్డను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పారు. చీరాల బీచ్‌కు వెళ్తున్న సమయంలో ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అఫీఫా ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని హోంమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 24 ఏళ్ల చిన్న వయసులోనే నిండు జీవితం ముగియడం అత్యంత బాధాకరమన్నారు. కన్నబిడ్డను కోల్పోవడం ఏ తల్లిదండ్రులకైనా తీరని వేదనని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న హోంమంత్రి, ప్రమాదంలో గాయపడిన వారి వివరాలపై కూడా ఆరా తీశారు. ఈ విషాద సమయంలో షిరీన్ బేగం, ఆమె కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు. అఫీఫా అకాల మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన హోంమంత్రి వంగలపూడి అనిత, షిరీన్ బేగం కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం, మనోస్థైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# సీఎం రేవంత్ సీరియస్..!



**హైదరాబాద్, మహా :** తెలంగాణ పౌరసరఫరాల వ్యవస్థలో దశాబ్దాలుగా పాతుకుపోయిన అవినీతి కుళ్లును కడిగేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమరశంఖం పూరించింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ పేరుతో ఏకంగా వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన బడా మిల్లర్ల బాగోతంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కన్నెర్రజేశారు. రైతుల చెమట చుక్కలతో పండిన ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి మిల్లింగ్ కోసం ఇస్తే, ఆ ధాన్యాన్ని పక్కదారి పట్టించి కోట్లు గడిస్తున్న అక్రమార్కుల భరతం పట్టేందుకు సర్కారు సన్నద్ధమైంది. ప్రభుత్వ బియ్యాన్ని దొడ్డిదారిన అమ్ముకుంటూ, పైగా ప్రభుత్వాన్నే బ్లాక్‌మెయిల్ చేస్తున్న డిఫాల్ట్ మిల్లర్ల ఆటలు ఇక తెలంగాణ గడ్డపై సాగవని ముఖ్యమంత్రి అత్యంత కఠినంగా హెచ్చరించారు. వేల కోట్ల బకాయిలు చెల్లించని మిల్లులను తక్షణమే స్వాధీనం చేసుకుని, వాటి యాజమాన్య హక్కులను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలన్న విప్లవాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది.

**జిల్లాల వారీగా అల్లుకున్న రైస్ మిల్లింగ్ మాఫియా**

రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా, అనధికారికంగా కలిపి సుమారు 2,500కు పైగా రైస్ మిల్లులు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ (మిర్యాలగూడ), సూర్యాపేట, పెద్దపల్లి వంటి ప్రధాన ధాన్యాగార జిల్లాల్లోనే అత్యధికంగా మిల్లులు కేంద్రీకృతమయ్యాయి. ఒక్క వరంగల్ జిల్లాలోనే సుమారు 360కి పైగా మిల్లులు ఉండగా, ఉమ్మడి నల్గొండ జిల్లాలో వందల సంఖ్యలో పారా బాయిల్డ్, రా రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ జిల్లాల కేంద్రంగానే అతిపెద్ద సీఎంఆర్ మాఫియా దశాబ్దాలుగా రాజ్యమేలుతోంది. ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మరపట్టి తిరిగి ఎఫ్‌సీఐ , పౌరసరఫరాల శాఖకు ఇవ్వాల్సిన మిల్లర్లు, ఆ ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటూ కోట్లు గడిస్తున్నారు. తీరా ప్రభుత్వం లెక్కలు అడిగేసరికి రకరకాల కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

**రికార్డులు బద్దలు కొట్టిన బాగోతం.. ఏకంగా రూ.13,399 కోట్లు**

రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన సీఎంఆర్ అవకతవకల లెక్కలు చూస్తే కళ్లు బైర్లు కమ్మడం ఖాయం. ఉన్నతాధికారుల తాజా అంతర్గత నివేదికల ఆధారంగా వెలుగులోకి వచ్చిన వాస్తవాలు అక్షరాలా రూ.13,399 కోట్ల కుంభకోణాన్ని బట్టబయలు చేస్తున్నాయి. దాదాపు 59.96 లక్షల టన్నుల బియ్యం లెక్కల్లోకి రాకుండా పక్కదారి పట్టిందంటే ఈ జిల్లాల్లోని మిల్లింగ్ మాఫియా ఏ స్థాయిలో చెలరేగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. గత పదేళ్ల కాలంలో జరిగిన ఈ భారీ దోపిడీలో (బీఆర్ఎస్ హయాంలో రూ.11,304 కోట్లు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రూ.2,095 కోట్లు) ప్రభుత్వం ఇప్పటికే కొంతమేర రికవరీ చేసినప్పటికీ, ఇంకా ఏకంగా 28.22 లక్షల టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని డిఫాల్ట్ మిల్లర్ల నుంచి సర్కారు ముక్కుపిండి వసూలు చేయాల్సి ఉంది. దీని విలువే సుమారు రూ.6,630 కోట్లకు పైగా ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తేల్చారు.

**సీఎం రేవంత్ సీరియస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంపై ఉగ్రరూపం దాల్చడానికి ప్రధాన కారణం మిల్లర్ల వ్యవహారశైలి, వారి బ్లాక్‌మెయిల్ పర్వమే! రైతుల నుంచి కొన్న ప్రభుత్వ ధాన్యానికి మిల్లర్లు కేవలం సంరక్షకులు మాత్రమే. కానీ వారు దానిని తమ సొంత జాగీరులా భావించి ఇతర వ్యాపారాలకు మళ్లించారు. నిజామాబాద్ లాంటి జిల్లాల్లో రోజుకు 6,000 టన్నుల సామర్థ్యం ఉన్నా ఉద్దేశపూర్వకంగా 2,000 టన్నులే మిల్లింగ్ చేస్తూ వ్యవస్థను ఇరకాటంలో పెట్టారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అయితే ఏకంగా నకిలీ బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చి ప్రభుత్వాన్నే మోసం చేశారు. అధికారులను రంగంలోకి దించి రికవరీకి వెళ్తే, ఎదురు తిరిగి కోర్టుల్లో కేసులు వేస్తూ ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి మిల్లర్లు దిగజారారు. ఈ అహంకార పూరిత, బ్లాక్‌మెయిల్ ధోరణిని గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. "ప్రభుత్వ ధాన్యాన్ని తిని, తిరిగి ఇవ్వకుండా ఎదురుదాడికి దిగే మిల్లర్ల ఆటలు ఇక సాగవు. ఉద్దేశపూర్వక డిఫాల్టర్లకు ఇక ధాన్యం కేటాయింపు ఉండదు. వారి ఆస్తులను జప్తు చేయండి. అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టులు చేయండి" అని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**మహిళా సంఘాల చేతికి రైస్ మిల్లులు**

మిల్లర్ల మెడలు వంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసిన తాజా స్కెచ్ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. డిఫాల్ట్ మిల్లులను జప్తు చేయడమే కాకుండా, ఆ మిల్లుల నిర్వహణను నేరుగా మహిళా స్వయం సహాయక సంఘాలకు (SHGs) అప్పగించాలన్నది సర్కార్ మాస్టర్ ప్లాన్. ఒకవైపు బకాయి పడిన మిల్లులపై కొరడా ఝుళిపించడం, మరోవైపు అదే మౌలిక సదుపాయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం అనే ద్వంద్వ లక్ష్యంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 553 మండల సమాఖ్యల ద్వారా 553 మిల్లుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం కాగా, ఇప్పుడు ఈ జప్తు చేసిన డిఫాల్టర్ల ఆస్తులను కూడా మహిళా సంఘాలకు అనుసంధానం చేయనున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు నుంచి మిల్లింగ్, ఎఫ్‌సీఐకి సరఫరా వరకు మొత్తం విలువ శృంఖలంలో తెలంగాణ మహిళలు అత్యంత కీలక భాగస్వాములుగా మారబోతున్నారు.

**కటకటాల వెనక్కి అక్రమార్కులు**

ప్రభుత్వం ఈసారి కేవలం నోటీసులకే పరిమితం కాలేదు. నేరుగా రెవెన్యూ రికవరీ చట్టం (RR Act) ప్రయోగించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తోంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో ఏడుగురు మిల్లర్లపై కేసులు నమోదు చేసి, సుమారు రూ.490 కోట్ల బకాయిల వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వ చర్యలను తట్టుకోలేక సుమారు 300 మందికి పైగా మిల్లర్లు హైకోర్టును ఆశ్రయించినా, సర్కారు ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ధాన్యం నాణ్యత బాగోలేదని ఇప్పుడు కోర్టులో సాకులు చెబుతున్న మిల్లర్లు, ధాన్యం తీసుకునేటప్పుడు ఎందుకు నోరు మెదపలేదని ప్రభుత్వం తరపున న్యాయవాదులు దీటుగా బదులిస్తున్నారు. ఒకవైపు రికార్డు స్థాయిలో పండుతున్న ఖరీఫ్ ధాన్యం సకాలంలో ఎఫ్‌సీఐ గోదాములకు చేరాలంటే పటిష్టమైన వ్యవస్థ ఉండాలి, మరోవైపు మిల్లింగ్ మాఫియాను కట్టడి చేయాలి. ఈ క్లిష్ట సమయంలో సిండికేట్‌గా మారి ఏకంగా ప్రభుత్వాన్నే శాసించాలనుకున్న రైస్ మిల్లర్ల సామ్రాజ్యాన్ని పునాదులతో సహా పెకిలించేందుకు రేవంత్ సర్కార్ సన్నద్ధమైంది. ప్రజాధనాన్ని లూటీ చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని సర్కారు తీసుకున్న తాజా నిర్ణయాలు, తెలంగాణ పౌరసరఫరాల చరిత్రలో పెను మార్పులకు నాంది పలుకుతున్నాయి!

# నీట్ ప్రశ్నపత్రం లీక్ వెనుక నిపుణులే

- **సీబీఐ దర్యాప్తులో సంచలన విషయాలు.**
- **ఇరవై వేల పేజీల అభియోగపత్రం.**
- **లాతూర్ ఆస్పత్రిలో రహస్య తరగతులు నిర్వహించినట్లు వెల్లడి.**




**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైద్య విద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన అభియోగపత్రం సంచలన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చింది. సుమారు 20 వేల పేజీలతో రూపొందించిన ఈ అభియోగపత్రాన్ని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ వ్యవహారంలో పదమూడు మందిని ప్రధాన నిందితులుగా పేర్కొన్న దర్యాప్తు సంస్థ.. ప్రశ్నపత్రం లీక్ వెనుక జాతీయ పరీక్షల సంస్థకు చెందిన ముగ్గురు సబ్జెక్టు నిపుణుల పాత్ర ఉన్నట్లు ఆధారాలతో సహా వివరించినట్లు సమాచారం. నిందితులు ఒక్కో ప్రశ్నపత్రం కోసం 10 నుంచి 15 లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు అభియోగాలు ఉన్నాయి.ఈ కేసులో దర్యాప్తు సంస్థ సేకరించిన ఆధారాల పరిమాణం కూడా భారీగా ఉంది. సుమారు ఇరవై వేల పేజీల అభియోగపత్రంతో పాటు 360 మంది సాక్షుల వాంగ్మూలాలు, 422 కీలక పత్రాలు, 43 భౌతిక, డిజిటల్ ఆధారాలను న్యాయస్థానం ముందు ఉంచినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. నిందితుల మధ్య జరిగిన సంభాషణలు, ఫోన్ సమాచార వివరాలు, ప్రశ్నపత్రాలతో సంబంధం ఉన్న పత్రాలు, చేతిరాత ఆధారాలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన తర్వాతే అభియోగపత్రాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది.

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశం జాతీయ పరీక్షల సంస్థకు చెందిన సబ్జెక్టు నిపుణుల పాత్రగా మారింది. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, గణితశాస్త్రానికి సంబంధించిన నిపుణులు కుట్రలో భాగస్వాములైనట్లు దర్యాప్తు సంస్థ పేర్కొన్నట్లు సమాచారం. ప్రశ్నపత్రం తయారీ, పరిశీలన, తుది రూపకల్పన వంటి అత్యంత గోప్యమైన ప్రక్రియలకు సంబంధం ఉన్న వ్యక్తులే ప్రశ్నలకు ముందుగానే ప్రాప్యత పొందడం ద్వారా లీక్‌కు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుల్లో ప్రశ్నపత్రం లీక్ చేసినవారితో పాటు మధ్యవర్తులు, శిక్షణా సంస్థల నిర్వాహకులు, నిపుణులు ఉన్నట్లు తెలుస్తోంది.

**ఆస్పత్రిలోనే రహస్య తరగతులు**

మహారాష్ట్రలోని లాతూర్‌లో వెలుగులోకి వచ్చిన ఘటన ఈ కేసులో మరింత కలకలం రేపుతోంది. సాధారణంగా రోగుల చికిత్స కోసం ఉపయోగించే ఆస్పత్రిలోని ఒక ప్రత్యేక గదిని రహస్య తరగతి గదిగా మార్చి, విద్యార్థులకు ముందుగానే ప్రశ్నలు, సమాధానాలు చెప్పినట్లు దర్యాప్తులో వెల్లడైంది.లాతూర్‌లోని రేణుకా ఈ-కెరీర్ శిక్షణా సంస్థ నిర్వాహకుడి కుమారుడికి సిద్ధివినాయక ఆస్పత్రిలోని మూడో అంతస్తులో రహస్యంగా తరగతులు నిర్వహించినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించినట్లు సమాచారం. జాతీయ పరీక్షల సంస్థకు చెందిన రసాయనశాస్త్ర నిపుణుడు ప్రశ్నల కాగితాల బండిల్‌తో అక్కడికి వచ్చి, రసాయనశాస్త్రానికి సంబంధించిన 132 ప్రశ్నలు, వాటి సమాధానాలను విద్యార్థితో నోటుపుస్తకంలో రాయించినట్లు అభియోగపత్రంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

ఏప్రిల్ 18, 19, 22 తేదీల్లో ఈ రహస్య తరగతులు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. పరీక్ష మే 3న జరగాల్సి ఉండగా, అందుకు ముందుగానే విద్యార్థికి ప్రశ్నలు, సమాధానాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. గంటల తరబడి జరిగిన ఈ రహస్య తరగతుల్లో విద్యార్థితో ప్రశ్నలు, సమాధానాలను రాయించి, వాటిని కంఠస్థం చేయించినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొన్నట్లు సమాచారం.

ఆస్పత్రి యజమాని మనోజ్ శిరూరే పాత్ర కూడా ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్నట్లు దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలోని గదిని రహస్య తరగతులకు అందుబాటులో ఉంచడం ద్వారా లీక్ వ్యవహారానికి సహకరించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి.

**పరీక్ష తర్వాత నోటుపుస్తకం అమ్మకం**

ఈ కేసులో దర్యాప్తు సంస్థకు మరో కీలక ఆధారం విద్యార్థి రాసుకున్న నోటుపుస్తకం కావడం గమనార్హం. ప్రశ్నలు, సమాధానాలు రాసుకున్న ఆ నోటుపుస్తకాన్ని పరీక్ష పూర్తయిన తర్వాత పాత సామాన్లు కొనుగోలు చేసే వ్యక్తికి విక్రయించినట్లు సంబంధిత విద్యార్థి విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ఆ నోటుపుస్తకంలో ఉన్న ప్రశ్నలను అసలు ప్రశ్నపత్రంతో పోల్చినప్పుడు వాటిలో గణనీయమైన సారూప్యతలు ఉన్నట్లు దర్యాప్తు సంస్థ గుర్తించినట్లు తెలుస్తోంది.

ఇదే సమయంలో నిందితుల ఫోన్లు, సందేశాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి సేకరించిన సమాచారాన్ని కూడా దర్యాప్తు అధికారులు విశ్లేషించినట్లు సమాచారం. ఒక విద్యార్థి కుటుంబ సభ్యుడి నుంచి నిపుణుడికి పంపిన సందేశం ఆధారంగా దర్యాప్తు అధికారులు మరింత లోతుగా విచారణ జరిపినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత నిందితుల మధ్య సంబంధాలు, సమావేశాలు, సంభాషణలు, ప్రశ్నపత్రం చేరిన మార్గాలను గుర్తించినట్లు సమాచారం.

**వ్యవస్థలోనే లోపాలున్నాయా?**

ఈ కేసు కేవలం కొంతమంది వ్యక్తులు చేసిన మోసానికి పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్ష నిర్వహణ వ్యవస్థలోని భద్రతా లోపాలను కూడా ప్రశ్నార్థకం చేస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రశ్నపత్రం తయారీ నుంచి ముద్రణ, భద్రపరచడం, పరీక్షా కేంద్రాలకు తరలించడం వరకు ప్రతి దశ అత్యంత గోప్యంగా ఉండాలి. అలాంటి వ్యవస్థలో అంతర్గతంగా పనిచేసే నిపుణులకే ప్రశ్నపత్రం ముందుగా అందితే అది తీవ్రమైన భద్రతా వైఫల్యంగా పరిగణించాల్సి ఉంటుంది.

ప్రశ్నపత్రం తయారీ ప్రక్రియలో పాల్గొనే వ్యక్తుల ఎంపిక, వారి నేపథ్య పరిశీలన, గోప్య సమాచారం రక్షణ, పర్యవేక్షణ, సమాచార ప్రసారంపై నియంత్రణ వంటి అంశాల్లో మరింత కఠినమైన చర్యలు అవసరమనే చర్చ ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది.

**లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం**

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే ఈ పరీక్షకు లక్షలాది మంది విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమవుతారు. ఒక్కసారి ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణలు రావడం వల్ల పరీక్ష రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే, నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుంది. పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు చేసిన ప్రయాణాలు, శిక్షణ కోసం చేసిన ఖర్చులు, మళ్లీ పరీక్షకు సిద్ధం కావాల్సిన పరిస్థితి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలను విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

అందుకే ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్ష నిర్వహణ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

**కోర్టులో కీలక దశకు చేరిన కేసు**

ఇరవై వేల పేజీల అభియోగపత్రం దాఖలు కావడంతో కేసు ఇప్పుడు కీలక న్యాయపరమైన దశకు చేరుకుంది. పదమూడు మంది నిందితులపై దర్యాప్తు సంస్థ చేసిన ఆరోపణలు, సాక్షుల వాంగ్మూలాలు, పత్రాలు, భౌతిక ఆధారాలు, సాంకేతిక ఆధారాలను న్యాయస్థానం పరిశీలించనుంది. నిందితులపై ఏ అభియోగాలను నమోదు చేయాలనే అంశంపై తదుపరి విచారణలో కీలక వాదనలు జరగనున్నాయి.అయితే అభియోగపత్రంలో దర్యాప్తు సంస్థ చేసిన ఆరోపణలు మాత్రమే తుది నేర నిర్ధారణ కావు. నిందితులపై ఉన్న ఆరోపణలు న్యాయస్థానంలో రుజువు కావాల్సి ఉంటుంది. అయినప్పటికీ దర్యాప్తు సంస్థ సమర్పించిన భారీ మొత్తంలో ఆధారాలు, నిపుణుల పాత్రపై చేసిన ఆరోపణలు, లాతూర్ ఆస్పత్రిలో జరిగినట్లు చెబుతున్న రహస్య తరగతుల వివరాలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి.వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచే నమ్మకానికి ఈ వ్యవహారం పెద్ద సవాలుగా మారింది. ప్రశ్నపత్రం తయారయ్యే దశ నుంచి విద్యార్థి చేతికి పరీక్షా పత్రం చేరే వరకు ప్రతి దశలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరాన్ని ఈ కేసు మరోసారి స్పష్టం చేసింది. లక్షలాది మంది భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల్లో ఒక్క చిన్న లోపం కూడా ఎంతటి భారీ పరిణామాలకు దారితీస్తుందో ఈ వ్యవహారం దేశానికి మరోసారి గుర్తుచేసింది.

## కేసీఆర్‌కు మరోసారి నోటీసులు

**సెప్టెంబర్ 9న తదుపరి విచారణ.**

హైదరాబాద్, మహా : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన వ్యవహారానికి సంబంధించిన కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంలో జారీ చేసిన నోటీసులు ఆయనకు అందలేదని తేలడంతో, ఈసారి నోటీసులను పక్కాగా అందజేసేలా తగిన చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది.

**ప్రైవేట్ ఫిర్యాదు.. విచారణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్**

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో నాణ్యతా లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు, ప్రజాధనం దుర్వినియోగం జరిగాయంటూ భూపాలపల్లికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి గతంలో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఇందులో బాధ్యులుగా పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు తగిన భూసాంకేతిక పరీక్షలు నిర్వహించలేదని, ఐపీసీలోని కుట్ర, మోసం సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అయితే, పిటిషనర్ రాజలింగమూర్తి మరణించినప్పటికీ ఈ న్యాయ ప్రక్రియను నిలిపివేయాల్సిన అవసరం లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేయడంతో కింది కోర్టులో విచారణకు మార్గం సుగమమైంది.

## డీలిమిటేషన్ వద్దు

- **తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తీర్మానం**
- **డీలిమిటేషన్ తో నష్టం జరుగుతుందన్న దళపతి**

**చెన్నై, మహా :** లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజనకు (డీలిమిటేషన్) వ్యతిరేకంగా సీఎం విజయ్ బుధవారం తమిళనాడు అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్‌కు తాము అంగీకరించేదే లేదని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్న తమిళనాడుకు డీలిమిటేషన్‌తో నష్టం జరుగుతుందని అన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నష్టమని చెప్పారు. ఈ తీర్మానంలో సీఎం విజయ్ మొత్తం మూడు డిమాండ్స్‌ను కేంద్రం ముందుంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ఎప్పటికీ 543 వద్ద స్తంభింపజేయాలని అన్నారు. రాష్ట్రాలకు ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను శాశ్వతం చేయాలని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావాలని అన్నారు. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో రాజకీయ సమీకరణాల మార్పులతో ఎన్డీయే బలం మరింత పెరిగిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో, కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు మరోసారి ప్రయత్నిస్తుందన్న కామెంట్స్ వచ్చాయి. అయితే, డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

## హర్ముజ్ మా సొంతం దగ్గరకొస్తే పేల్చేస్తాం

**ఇరాన్ పై ట్రంప్ ఫైర్**

**మహా :** హోర్ముజ్ జలసంధి పూర్తిగా తమ నియంత్రణలో ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ రెచ్చగొట్టే చర్యలకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. 'నేను ఇరాన్‌ను విశ్వసించను. వాళ్లు నిత్యం నాతో అబద్ధాలు ఆడుతూనే ఉన్నారు. ప్రస్తుతం హోర్ముజ్‌పై మాకు పూర్తి నియంత్రణ ఉంది. వాళ్లకు హోర్ముజ్‌పై కంట్రోల్ లేదు. అది మా సొంతం. వాళ్లు ఈ విషయంలో ఏదోకటి చేసేందుకు ప్రయత్నించి చివరకు తుత్తునియలు అవుతారు' అని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో అమెరికా పటిష్ఠ స్థితిలో ఉందని కూడా చెప్పారు. 'పశ్చిమాసియాలో ఇరుగుపొరుగును ఓ దేశం గత 50 ఏళ్లుగా బెదిరిస్తోంది. ఆ బెదిరింపులకు ఇక కాలం చెల్లిపోయింది' అని ట్రంప్ అన్నారు. మరోవైపు, అమెరికా అన్యాయంగా, అవమానకరంగా తమపై ఆంక్షలు విధిస్తోందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 'ప్రస్తుతం హోర్ముజ్‌లో పరిస్థితులకు అమెరికా, ఇజ్రాయెల్ కారణం. ఇప్పటికీ వారి దాడులు కొనసాగుతున్నాయి' అని విదేశాంగ శాఖ ప్రతినిధి అన్నారు. ఇదిలా ఉంటే, హోర్ముజ్‌లో భద్రంగా రవాణా కొనసాగించే దిశగా ఇరాన్, ఒమాన్ మధ్య చర్చలు జరుగుతున్నట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి.

# మనం నిజంగా స్వతంత్రులమేనా?



ఆగస్టు 15 వస్తే దేశమంతా దేశభక్తి మూడ్లోకి వెళ్తుంది. జెండాలు ఎగురుతాయి. దేశభక్తి గీతాలు వినిపిస్తాయి. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటాం. కానీ ఆ ఒక్కరోజు వేడుకలు ముగిసిన వెంటనే నిరుద్యోగం, పేదరికం, కుల వివక్ష, రైతు సమస్యలు, విద్యా అసమానత, వైద్యం అందకపోవడం, ధరల పెరుగుదల వంటి సమస్యలు మళ్లీ మన ముందుకొస్తాయి. 1947లో దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం ప్రతి పౌరుడి జీవితంలో నిజమైన స్వేచ్ఛగా మారిందా? 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వలస పాలన అంతమైంది. అది భారత చరిత్రలో మహత్తర ఘట్టం. లక్షలాది మంది త్యాగాల ఫలితంగా రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది. అయితే బ్రిటిష్ పాలకులు వెళ్లిపోవడం మాత్రమే స్వాతంత్ర్యానికి అంతిమ అర్థం కాదని డా. బి.ఆర్. అంబేద్కర్ ఆలోచన మనకు గుర్తు చేస్తుంది. డా. బి.ఆర్. అంబేద్కర్ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం విముక్తి పొందడాన్ని వ్యతిరేకించలేదు. కానీ ఆయన దృష్టిలో రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సరిపోదు. సామాజిక, ఆర్థిక స్వేచ్ఛ లేకపోతే రాజకీయ స్వాతంత్ర్యం అసంపూర్ణమే. బ్రిటిష్లు వెళ్లిపోయి అధికారం భారతీయుల చేతుల్లోకి వచ్చినా, కుల వ్యవస్థ కొనసాగితే? పుట్టుక ఆధారంగా మనిషి స్థానం నిర్ణయించబడితే? దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు సామాజికంగా అణచివేయబడితే? పేదలకు విద్య, ఉపాధి, వైద్యం అందకపోతే? అలాంటి పరిస్థితిని సంపూర్ణ స్వాతంత్ర్యంగా ఎలా పిలవగలం? అంబేద్కర్ ఆలోచనలో నిజమైన స్వరాజ్యం అంటే కేవలం పాలకుడు మారడం కాదు సమాజం మారడం. అందుకే ఆయన కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆర్థిక న్యాయాన్ని నిజమైన ప్రజాస్వామ్యానికి పునాదులుగా చూశారు. రాజకీయ ప్రజాస్వామ్యం ఉన్నా సామాజిక ప్రజాస్వామ్యం లేకపోతే బలహీన వర్గాలకు స్వాతంత్ర్యం కేవలం కాగితంపై మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జాతీయోద్యమం ప్రధానంగా రాజకీయ స్వాతంత్ర్యంపై దృష్టి పెట్టిందని అంబేద్కర్ విమర్శించారు. దళితుల రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక హక్కులు, కుల వివక్ష నిర్మూలన వంటి ప్రశ్నలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన భావించారు. 1932 పూనా ఒప్పందం సందర్భంగా ప్రత్యేక నియోజకవర్గాల అంశంపై గాంధీజీతో ఆయనకు తీవ్రమైన విభేదాలు రావడం కూడా ఈ సామాజిక రాజకీయ ప్రశ్నల ప్రాధాన్యాన్ని చూపిస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పోషించిన పాత్ర చరిత్రాత్మకం. రాజ్యాంగం ద్వారా సమానత్వం, స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు, అంటరానితనం నిర్మూలన, సామాజిక న్యాయం, రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే హక్కులు రాజ్యాంగంలో రాసినంత మాత్రాన ప్రజల జీవితాల్లో అమలు కావని, వాటిని ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత సమాజం, ప్రభుత్వాలపై ఉందని ఆయన ఆలోచన మనకు గుర్తు చేస్తుంది.

భారతదేశం అనేక రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధించింది. వ్యవసాయం, పరిశ్రమ, విజ్ఞానం, అంతరిక్షం, సాంకేతికత, మౌలిక వసతులు వంటి రంగాల్లో దేశం ముందుకు వెళ్లింది. ప్రపంచంలో భారతదేశ స్థానం కూడా బలపడింది. ఇవన్నీ గర్వించాల్సిన విజయాలే. కానీ అభివృద్ధిని కేవలం గణాంకాలతో కొలవలేం. మెట్రో రైళ్లు, భారీ భవనాలు, డిజిటల్ చెల్లింపులు ఎంత ముఖ్యమో, ఒక పేద పిల్లవాడికి నాణ్యమైన విద్య, ఒక యువకుడికి గౌరవప్రదమైన ఉద్యోగం, ఒక రైతుకు తన శ్రమకు తగిన ఆదాయం, ఒక మహిళకు తన జీవితంపై నిర్ణయాధికారం, కుల వివక్షకు గురయ్యే మనిషికి సమాన గౌరవం కూడా అంతే ముఖ్యం. దేశం ఎంత ఎదిగిందో తెలుసుకోవాలంటే ఆకాశాన్ని మాత్రమే చూడకూడదు. నేల మీద నడుస్తున్న చివరి మనిషి జీవితాన్ని కూడా చూడాలి. నిరుద్యోగ యువకుడు ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తుంటే, రైతు తన పంటకు గిట్టుబాటు ధర కోసం పోరాడుతుంటే, పేద కుటుంబం వైద్యం కోసం అప్పులపాలవుతుంటే, పుట్టిన కులం కారణంగా ఒక మనిషి అవమానాన్ని ఎదుర్కొంటుంటే మన స్వాతంత్ర్య ప్రయాణం ఇంకా పూర్తికాలేదని అర్థం. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేయడం కాదు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించగలగాలి. ప్రభుత్వ విధానాలను విమర్శించగలగాలి. తమ హక్కుల కోసం నిరసన వ్యక్తం చేయగలగాలి. ప్రభుత్వం దేశం కాదు. రాజకీయ పార్టీ దేశం కాదు. నాయకుడు దేశం కాదు. దేశం అంటే ప్రజలు. దేశాన్ని విమర్శించడం దేశాన్ని ద్వేషించడం కాదు. తప్పులను ప్రశ్నించడం దేశద్రోహం కాదు. స్వాతంత్ర్య పోరాటం మనకు నేర్పిన గొప్ప పాఠాల్లో ఒకటి అన్యాయాన్ని ప్రశ్నించడమే. ఈ ప్రశ్నలు నేడు దేశవ్యాప్తంగా విద్యార్థుల ఉద్యమాల్లోనూ వినిపిస్తున్నాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల ఆందోళన, ప్రస్తుతం జార్ఖండ్లో పేపర్ లీకులు, నియామక పరీక్షల్లో అవకతవకలు, ఉద్యోగాల కోసం జరుగుతున్న విద్యార్థుల పోరాటం ఇవన్నీ యువత తమ భవిష్యత్తు కోసం అడుగుతున్న ప్రశ్నలే. పరీక్ష రాసిన విద్యార్థికి న్యాయమైన ఫలితం, చదువుకున్న యువతకు పారదర్శకమైన నియామకాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. కానీ విద్య, ఉపాధి, ఆరోగ్యం, రైతు సమస్యలు వంటి అసలు ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాజకీయ పార్టీలు కులం, మతం, ప్రాంతం వంటి భావోద్వేగాలను ఓట్ల రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నాయి. యువత ఉద్యోగం అడుగుతుంటే కులాన్ని చూపిస్తున్నారు, ప్రజలు అభివృద్ధి అడుగుతుంటే మతాన్ని చూపిస్తున్నారు. ప్రజలను కలపాల్సిన రాజకీయాలు వారిని కులం, మతం పేరుతో విడదీస్తే అది ప్రజాస్వామ్యానికి బలం కాదు. ప్రజలు ప్రశ్నించాల్సింది ఒకరినొకరు కాదు తమ సమస్యలకు సమాధానం చెప్పాల్సిన అధికారాన్ని. 1947లో మనం వలస పాలన నుంచి రాజకీయ స్వాతంత్ర్యం పొందాం. కానీ అంబేద్కర్ ఆలోచన మనకు మరో బాధ్యతను గుర్తు చేస్తుంది ప్రతి మనిషికి సామాజిక స్వేచ్ఛ, ఆర్థిక భద్రత, సమాన గౌరవం లభించినప్పుడే స్వాతంత్ర్యం సంపూర్ణమవుతుంది. ఒక పేద పిల్లవాడు తన పేదరికాన్ని అధిగమించి చదువుకునే అవకాశం పొందాలి. ఒక యువకుడు తన చదువుకు తగిన ఉద్యోగం పొందాలి. రైతు తన శ్రమకు గౌరవప్రదమైన ఆదాయం పొందాలి. మహిళ తన జీవితాన్ని తన ఇష్టానుసారం నిర్ణయించుకోగలగాలి. కులం, మతం, పుట్టుక, ప్రాంతం ఆధారంగా మనిషి అవకాశాలు తగ్గకూడదు. ఒక పౌరుడు తన ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు భయపడకూడదు. అప్పుడే స్వాతంత్ర్యం ఒక చారిత్రక తేదీ నుంచి జీవించే వాస్తవంగా మారుతుంది. ఆగస్టు 15న జెండా ఎగురవేద్దాం. స్వాతంత్ర్యం సమరయోధులను స్మరించుకుందాం. దేశభక్తి గీతాలు పాడుదాం. కానీ ఆ వేడుకల మధ్యలో ఒకసారి మన చుట్టూ ఉన్న భారతదేశాన్ని కూడా చూద్దాం. ఎందుకంటే దేశభక్తి అంటే కేవలం జెండాకు సెల్యూట్ చేయడం కాదు ఆ జెండా కింద జీవిస్తున్న ప్రతి మనిషి గౌరవాన్ని కాపాడటం కూడా.

1947లో ఒక తరం మనకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని అందించింది. ఇప్పుడు మన తరం ఆ స్వాతంత్ర్యాన్ని సామాజిక న్యాయంగా, సమానత్వంగా, గౌరవంగా ప్రతి మనిషి జీవితంలోకి తీసుకురావాలి. అదే అంబేద్కర్ చూపించిన నిజమైన స్వాతంత్ర్య దారి. అదే 79 ఏళ్ల భారతదేశం ముందు నిలిచిన అసలు ప్రశ్న.



బసడ సంపత్ యాదవ్
7032132593

# నొప్పి లేని గడ్డను నిర్లక్ష్యం చేయొద్దు



శరీరంలోని ఏ భాగంలోనైనా నొప్పి లేకుండా కనిపించే గడ్డను చాలామంది సాధారణ కొవ్వు గడ్డ, చిన్న వాపు లేదా తాత్కాలిక సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే ప్రతి గడ్డ క్యాన్సర్ అని అర్థం కాకపోయినా, కొత్తగా ఏర్పడి క్రమంగా పెరుగుతున్న గడ్డను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. అరుదైన సందర్భాల్లో అలాంటి గడ్డ సాఫ్ట్ టిష్యూ సార్కోమా అనే క్యాన్సర్‌కు సంకేతంగా ఉండొచ్చు. ముఖ్యంగా గడ్డ వేగంగా పెరగడం, లోపలికి లోతుగా ఉండటం, గట్టిగా అనిపించడం లేదా 5 సెంటీమీటర్లకు మించి ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం.

సాఫ్ట్ టిష్యూ సార్కోమా అనేది శరీరంలోని మెత్తటి కణజాలాల్లో ఏర్పడే అరుదైన క్యాన్సర్ రకం. కండరాలు, కొవ్వు, రక్తనాళాలు, నరాలు, స్నాయువులు, తంతుయుత కణజాలం వంటి భాగాల్లో ఇది అభివృద్ధి చెందవచ్చు. చేతులు, కాళ్లు, ఛాతీ, పొత్తికడుపు, నడుము ప్రాంతం వంటి శరీర భాగాల్లో ఇది కనిపించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో పొత్తికడుపులో ఏర్పడిన సార్కోమా పెద్దదయ్యే వరకు స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చు.

**ఏ భాగంలో రావచ్చు?**

సాఫ్ట్ టిష్యూ సార్కోమా శరీరంలోని అనేక ప్రాంతాల్లో ఏర్పడవచ్చు. ముఖ్యంగా చేతులు, కాళ్లలో గడ్డ రూపంలో కనిపించడం సాధారణం. శరీర మధ్య భాగం, ఛాతీ, పొత్తికడుపు, నడుము ప్రాంతాల్లోనూ ఇది ఏర్పడవచ్చు. గడ్డ ఏర్పడిన ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతాయి. ఉదాహరణకు పొత్తికడుపులో గడ్డ పెరిగితే కడుపు నొప్పి, పొత్తికడుపు ఉబ్బరం, జీర్ణవ్యవస్థకు సంబంధించిన ఇబ్బందులు రావచ్చు. గడ్డ నరాలు లేదా కండరాలపై ఒత్తిడి పెడితే నొప్పి, బలహీనత, కదలికల్లో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుంది.

**ఎందుకు వస్తుంది?**

సాఫ్ట్ టిష్యూ సార్కోమా ఎందుకు ఏర్పడుతుందనే దానికి చాలా సందర్భాల్లో స్పష్టమైన కారణం తెలియదు. అయితే కొన్ని వంశపారంపర్య పరిస్థితులు, గతంలో తీసుకున్న కొన్ని రకాల రేడియేషన్ చికిత్సలు వంటి అంశాలు ప్రమాదాన్ని పెంచవచ్చు. దీర్ఘకాలంగా ఉండే లింఫ్ వాపు వంటి కొన్ని పరిస్థితులు కూడా కొన్ని రకాల సార్కోమాలతో సంబంధం కలిగి ఉండవచ్చు. అయితే సార్కోమా వచ్చిన ప్రతి వ్యక్తిలోనూ ఒక నిర్దిష్ట కారణాన్ని గుర్తించడం సాధ్యం కాదు.

**ముఖ్య లక్షణాలు ఇవే**

సాఫ్ట్ టిష్యూ సార్కోమాలో ప్రధానంగా కనిపించే లక్షణం గడ్డ లేదా వాపు. ప్రారంభ దశలో ఈ గడ్డకు నొప్పి లేకపోవచ్చు. అందుకే సాధారణ కొవ్వు గడ్డగా భావించి చాలామంది పట్టించుకోరు. అయితే గడ్డ క్రమంగా పెరుగుతుంటే అప్రమత్తంగా ఉండాలి. గడ్డ పెద్దదయ్యే కొద్దీ సమీపంలోని నరాలు, కండరాలు లేదా ఇతర కణజాలాలపై ఒత్తిడి పెరిగి నొప్పి, తిమ్మిరి, బలహీనత లేదా కదలికల్లో ఇబ్బందులు కలగవచ్చు. కింది లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించడం మంచిది:

**నొప్పి లేకపోయినా గడ్డ క్రమంగా పెరుగుతూ ఉండటం.**

గడ్డ 5 సెంటీమీటర్లకు మించి ఉండటం.

గడ్డ చర్మం కింద కాకుండా లోతుగా ఉన్నట్లు అనిపించడం.

**గడ్డ కదలకుండా గట్టిగా ఉండటం.**

కొంతకాలం తర్వాత గడ్డకు నొప్పి రావడం.

గడ్డ కారణంగా చేతులు, కాళ్ల కదలికల్లో ఇబ్బంది లేదా బలహీనత రావడం.

పొత్తికడుపులో గడ్డతో పాటు నొప్పి, ఉబ్బరం లేదా ఇతర సమస్యలు కనిపించడం.

**5 సెంటీమీటర్లు దాటితే జాగ్రత్త**

వైద్య మార్గదర్శకాల్లో 5 సెంటీమీటర్లకు మించిన గడ్డ, వేగంగా పెరుగుతున్న గడ్డ, లోతుగా ఉన్న గడ్డ, నొప్పితో కూడిన గడ్డ వంటి లక్షణాలను సార్కోమా అనుమానంతో పరిశీలించాల్సిన సూచనలుగా పేర్కొంటారు. అయితే 5 సెంటీమీటర్ల కంటే చిన్న గడ్డలో సార్కోమా ఉండదని అర్థం కాదు. అలాగే 5 సెంటీమీటర్లకు మించిన ప్రతి గడ్డ క్యాన్సర్ కూడా కాదు. అనేక సాధారణ పరిస్థితుల వల్ల కూడా శరీరంలో గడ్డలు ఏర్పడవచ్చు. అందువల్ల పరిమాణాన్ని బట్టి స్వయంగా నిర్ణయం తీసుకోకుండా వైద్య పరీక్ష చేయించుకోవాలి.

**కొవ్వు గడ్డతో తేడా ఏమిటి?**

శరీరంలో కనిపించే ప్రతి గడ్డను సార్కోమాగా భావించాల్సిన అవసరం లేదు. సాధారణ కొవ్వు గడ్డలు సహా అనేక కారణాలతో శరీరంలో వాపులు, గడ్డలు ఏర్పడవచ్చు. అయితే కొత్తగా ఏర్పడిన గడ్డ క్రమంగా పెరుగుతుంటే, లోతుగా ఉంటే లేదా గట్టిగా అనిపిస్తే వైద్యుడి సలహా తీసుకోవాలి. గడ్డ స్వభావాన్ని కేవలం చేతితో తాకి నిర్ణయించడం సాధ్యం కాదు. అవసరాన్ని బట్టి వైద్యులు చిత్రీకరణ పరీక్షలు, కణజాల పరీక్షలు నిర్వహిస్తారు.

**నివారణ సాధ్యమేనా?**

సాఫ్ట్ టిష్యూ సార్కోమాను పూర్తిగా నివారించడానికి అందరికీ వర్తించే నిర్దిష్ట మార్గం ప్రస్తుతం లేదు. ఎందుకంటే అనేక సందర్భాల్లో దీని ఏర్పాటుకు స్పష్టమైన కారణం గుర్తించబడదు. అయితే శరీరంలో కొత్తగా ఏర్పడిన లేదా మార్పు చెందుతున్న గడ్డలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం ద్వారా వ్యాధిని త్వరగా గుర్తించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నొప్పి లేదని గడ్డను పట్టించుకోకపోవడం సరికాదు. శరీరంలో కనిపించిన ప్రతి గడ్డ క్యాన్సర్ కాదు. కానీ తగ్గకుండా కొనసాగుతున్న, క్రమంగా పెరుగుతున్న, పెద్దదవుతున్న లేదా లోతుగా ఉన్న గడ్డకు తప్పనిసరిగా వైద్యపరమైన అంచనా అవసరం. ప్రారంభ దశలో గుర్తించిన కొన్ని సాఫ్ట్ టిష్యూ సార్కోమాలకు చికిత్స ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

**వైద్యుల సూచనను తప్పనిసరిగా పాటించాలి**

శరీరంలో ఏదైనా కొత్త గడ్డ కనిపించినప్పుడు ఇంటర్నెట్ సమాచారం ఆధారంగా అది కొవ్వు గడ్డా, సార్కోమానా అని స్వయంగా నిర్ణయించుకోవద్దు. గడ్డ ఎంతకాలంగా ఉంది, పరిమాణం పెరుగుతోందా, ఎక్కడ ఉంది, నొప్పి ఉందా వంటి వివరాలను వైద్యుడికి చెప్పాలి. అవసరమైతే నిపుణుల సూచనతో పరీక్షలు చేయించుకోవాలి. ముందస్తు వైద్య సలహా అనవసర భయాన్ని తగ్గించడమే కాకుండా, నిజంగా సమస్య ఉన్నట్లయితే సరైన సమయంలో చికిత్స ప్రారంభించేందుకు సహాయపడుతుంది.

# కల్యాణ ఘడియలు వచ్చేశాయ్

**నేటి నుంచే పవిత్ర శ్రావణ మాసం ప్రారంభం ● మళ్లీ మోగనున్న పెళ్లి బాజాలు ● శ్రావణ లక్ష్మితో తెలుగు లోగిళ్లలో పండుగ వాతావరణం!**

## ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 14 వరకు ఆగని పెళ్లిళ్లు.

**హైదరాబాద్, మహా:** ఆషాఢ మాసం ముగియడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరీక్షణకు తెరపడింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న శుభగడియలు మళ్లీ వచ్చేశాయి. హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రంగా, సాక్షాత్తూ ఆ లక్ష్మీదేవికి ప్రతిరూపంగా భావించే 'శ్రావణ మాసం' ఆగస్టు 13 నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ మాసంలో ఏ కార్యం తలపెట్టినా నిర్విఘ్నంగా పూర్తవుతుందనే ప్రగాఢ విశ్వాసంతో, పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, నిశ్చితార్థాలు వంటి శుభకార్యాలకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ప్రతి ఇల్లూ పచ్చని తోరణాలు, బంధుమిత్రుల కోలాహలంతో సందడిగా మారనుంది.

**మళ్లీ మోగనున్న పెళ్లి బాజాలు**

తెలుగు రాష్ట్రాల్లో శుభకార్యాల సందడి మళ్లీ మొదలుకానుంది. ఆగస్టు 12తో ఆషాఢ మాసం అమావాస్య ముగియనుండటంతో, తదుపరి రోజు నుంచే పవిత్రమైన శ్రావణ మాసం అడుగుపెడుతోంది. వివాహాలు, నిశ్చితార్థాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు, నూతన వ్యాపార ప్రారంభాలు తదితర కార్యక్రమాలకు శ్రావణ మాసం అత్యంత అనుకూలమైన కాలంగా భావిస్తారు. దీంతో తెలుగు లోగిళ్లలో



మళ్లీ పెళ్లి బాజాలు మోగనున్నాయి.

**శుభముహూర్తాల వివరాలు**

జ్యోతిష్య పండితులు, తాజా పంచాంగ వివరాల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి సెప్టెంబరు 14వ తేదీ వరకు వివాహాది శుభకార్యాలకు అనేక అద్భుతమైన ముహూర్తాలు ఉన్నాయి. ఆగస్టు నెలలో 15, 16, 17, 20, 21, 22, 23, 26, 27, 28, 29, 30 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉండగా, సెప్టెంబరు నెలలో 3, 4, 5, 8, 10, 11, 13, 14 తేదీల్లో బలమైన లగ్నాలు ఉన్నట్లు పురోహితులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 5 వరకు వరుస ముహూర్తాలు కేంద్రీకృతమై ఉండటంతో ఇరు రాష్ట్రాల్లో వేలాది జంటలు అగ్నిసాక్షిగా ఒక్కటి కానున్నాయి.

**మార్కెట్లలో పెరిగిన సందడి**

పెళ్లిళ్ల సీజన్ ఊపందుకోవడంతో స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా పెద్ద ఊతం లభిస్తోంది. కేవలం మూడు వారాల వ్యవధిలోనే ఎన్నో శుభకార్యాలు ఉండటంతో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు ఇప్పటికే పూర్తిగా బుక్ అయిపోయాయి. పురోహితులు, డెకరేటర్లు, ఈవెంట్ ఆర్గనైజర్లు, క్యాటరింగ్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. దీనికి తోడు పట్టు వస్త్రాల దుకాణాలు, బంగారు ఆభరణాల షోరూమ్‌లు, పూల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. నూతన వాహనాల కొనుగోలుకు కూడా ఈ మాసం అనుకూలం కావడంతో ఆటోమొబైల్ రంగంలోనూ కొనుగోళ్ల కోలాహలం నెలకొంది.

**ఆధ్యాత్మిక శోభ.. పండితుల సూచన**

శ్రావణ మాసానికి తెలుగు సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది. మహిళలు ఈ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావించి మంగళగౌరి వ్రతాలు, వరలక్ష్మీ వ్రతం, సోమవారాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆలయాలు, పూజా సామగ్రి దుకాణాల్లోనూ ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. అయితే, వివాహ ముహూర్తాల ఎంపికలో పంచాంగాల మధ్య స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉందని పండితులు సూచిస్తున్నారు. కేవలం ప్రచారంలో ఉన్న తేదీలనే కాకుండా, వధూవరుల జన్మనక్షత్రాలు, స్థానిక ప్రాంతీయ సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని వ్యక్తిగత పురోహితుల సలహాతో తుది ముహూర్తాన్ని ఖరారు చేసుకోవడం ఉత్తమమని వారు సలహా ఇస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే, ఆషాఢంతో నెమ్మదించిన వాతావరణానికి తెరదించుతూ.. రానున్న కొన్ని వారాల పాటు రెండు తెలుగు రాష్ట్రాలు పెళ్లి వేడుకలతో, ఆధ్యాత్మిక శోభతో పండుగ వాతావరణాన్ని తలపించనున్నాయి.





# కాలభైరవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ బాగాయత్‌లోని కాలభైరవ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలభైరవ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వర్షాలు పడాలని అందరూ చల్లంగా బతకాలని కాలభైరవ స్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చర్లపల్లి రోడ్లు, డ్రైనేజీలకు నిధులు ఇవ్వాలి

- మంత్రి శ్రీధర్ బాబును కోరిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా** : భారీ వర్షాలతో చర్లపల్లి డివిజన్‌లో ఆయా కాలనీలలో దెబ్బతిన్న బీటీ, సీసీ రోడ్లు, వర్షపు నీటి కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్ బాబును ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు మంత్రికి వినతి పత్రం అందించారు. కుషాయిగూడ. చర్లపల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు ఉన్న కాలువలు దెబ్బతినడంతో నీరు నిలిచి పోతున్నట్లు పేర్కొన్నారు. కొత్త బీటీ రోడ్ల నిర్మాణం, దెబ్బతిన్న సీసీ రోడ్ల పునర్నిర్మాణం, వర్షపు నీటి కాలువల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రజల సౌకర్యం, భద్రత దృష్ట్యా పనులను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిధులు కేటాయించేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. పాడైపోయిన రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు అంగీకరించారు.




# ఎన్ఐఓఎస్ ద్వారా 78 మంది ఖైదీలకు ఎస్ఎస్ సి ఉత్తీర్ణత

- ఖైదీల విద్య, పునరావాసానికి జైళ్ల శాఖ ప్రోత్సాహం
- ఉత్తీర్ణులకు డీజీ ప్రత్యేక రిమిషన్

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ జైళ్ల శాఖ చరిత్రలో తొలిసారిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఖైదీల విద్య, స్వీయాభివృద్ధి, పునరావాసాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని జైళ్ల శాఖ చేపట్టింది. ఖైదీలు విద్యను కొనసాగించేలా జైళ్ల శాఖ ఎన్ఐఓఎస్ తో ఒప్పందం చేసుకుంది. అనంతరం చర్లపల్లి, నిజామాబాద్ కేంద్ర కారాగారాలతో పాటు హైదరాబాద్ ప్రత్యేక మహిళా కారాగారానికి చెందిన 108 మంది ఖైదీలు పదవ తరగతిలో చేరారు. వారి కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు అవసరమైన చోట ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించి, వారి వేతనాలను జైళ్ల శాఖ భరించింది. ఏడాది పాటు క్రమబద్ధమైన విద్యా ప్రణాళికలో భాగంగా తరగతులు, మాక్ టెస్టులు, ప్రీబోర్డు పరీక్షలు నిర్వహించి ఖైదీలను పరీక్షలకు సిద్ధం చేశారు. ఫలితంగా చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి 56 మంది, నిజామాబాద్ నుంచి 15 మంది, హైదరాబాద్ ప్రత్యేక మహిళా కారాగారం నుంచి ఏడుగురు చొప్పున మొత్తం 78 మంది ఉత్తీర్ణులయ్యారు. జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా ఉత్తీర్ణులైన ఖైదీలకు ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసాన్ని ఆమె ప్రశంసించారు. విద్య ద్వారా జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పానికి ఈ విజయం నిదర్శనమన్నారు.. విద్యపై ఖైదీలు చూపిన కృషి, క్రమశిక్షణకు గుర్తింపుగా ఎన్ఐఓఎస్ ద్వారా ఎస్ఎస్ సి .ఉత్తీర్ణత సాధించిన 78 మందికి డైరెక్టర్ జనరల్ రిమిషన్‌ను ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. ఇతర ఖైదీలు కూడా విద్య వైపు అడుగులు వేయడానికి ఇది ప్రేరణగా నిలుస్తుందని ఈ సందర్భంగా డీజీ పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన ఖైదీలను ఎన్ఐఓ ఎస్ ద్వారా సీనియర్ సెకండరీ విద్య కొనసాగించేలా ప్రోత్సహించనున్నారు. మరో 47 మంది ఖైదీలు తాజాగా ఎస్ఎస్ సిలో నమోదు చేసుకున్నారు. ఇంటర్ పూర్తి చేసిన అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారంలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా బీఏ కోర్సుల్లో చేరే అవకాశం కల్పించనున్నారు. అలాగే ఎస్ . ఎస్ . సి .ఉత్తీర్ణులైన 78 మంది ఖైదీలు చర్లపల్లి కేంద్ర కారాగారంలోని ఐటీఐలో వివిధ సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అర్హులని డీజీ తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో స్వయం ఆధారిత జీవితం వైపు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఐఓఎస్ జాయింట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ పరంప్రీత్ సింగ్, హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ డా. ప్రవీణ్ చౌహాన్, జైళ్ల శాఖ ఐజీ వై. రాజేష్, డీఐజీలు డా. డి. శ్రీనివాస్, ఎం. సంపత్, పలువురు జైలు సూపరింటెండెంట్లు, అధికారులు, ఎన్ఐఓఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.




# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

- సేంద్రియ ఆహార ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ ఉంది
- నేల సారం పెరిగి నీటి వినియోగం తగ్గుతుంది
- జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మధుమోహన్



**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని హమీదుల్లానగర్ రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో ఆర్ పిఎల్ ఆధారితమైన కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ వ్యవసాయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ పర్యవేక్షణలోప్రకృతి ఎలినో ప్రభావంతోసేంద్రీయ వ్యవసాయం, వరిసాగులో మెలకువలపై రైతులకు రెండు రోజుల శిక్షణా అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, పచ్చి రొట్ట ఎరువులు వాడాలన్నారు. పురుగుల నియంత్రణకు వేపనూనె, వేపపిండి, గోమూత్ర కషాయం వంటి సహజమైన పద్ధతులను పాటించాలి. డాక్టర్ శ్రీధర్ సిద్ది ( సీనియర్ సైంటిస్ట్) మాట్లాడుతూ రైతులకు సేంద్రీయ వ్యవసాయం చేయడం ద్వారా రసాయనాలు లేని పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం సాధ్యం అవుతుందని తెలిపారు. నేల సారం పెరిగి నీటి వినియోగం తగ్గుతుందని మార్కెట్లో సేంద్రీయ ఉత్పత్తులకు డిమాండ్ ఉందన్నారు. వరి లో అధిక దిగుబడి నిచ్చే నూతన వంగడాలను రైతులకు పరిచయం చేశారు. డాక్టర్ కిరణ్ బాబు సైంటిస్ట్ ప్లాంట్ పాతాలజీ, రైస్ రిసెర్చ్ సెంటర్, భూమి ఆరోగ్యం కోసం పంట మార్పిడి, ఇతర పంటలను వేయాలన్నారు. శంషాబాద్ రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం చాలా దగ్గరలో ఉన్నందున అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అభివృద్ధి చెందాలని కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ సత్యనారాయణ మాట్లాడుతూ శంషాబాద్ పరిసర ప్రాంతాలలో రైతులు ఎక్కువగా పండించే వరి పంటకు వివిధ దశల్లో పాటించాల్సిన విధానాలు, మెలకువలు, విత్తన శుద్ధి, ఎరువుల, నానో యూరియా, నానో డిఎపి నారుమడి, నాట్లు వేసే సమయం, కలుపు నివారణ, నీటి యాజమాన్యం, పురుగు మందుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎలానో ప్రభావం దృష్ట్యా రైతులందరూ ఆరుతడి పంటలనే వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ మాజీ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శోభా రాణి, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శ్రీవిద్య, శ్రావణి, శ్రవంతి, రైతులు నర్సింహ, సుధాకర్ రెడ్డి, బాల్ రెడ్డి మహిపాల్, శ్రీకాంత్, డి సిఎస్ వాలంటీర్లు మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ రావు నగర్ డివిజన్ లో

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కుషాయిగూడ, మహా : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యా నర్సిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. సౌత్ కమలానగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నార్త్ కమలానగర్, శివాలయం మీదుగా ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు వరకు కొనసాగింది. వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు, యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశభక్తిని చాటుతూ ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంబటి వెంకటాచలం, జీవీఎస్ రావు, మల్యాల సతీష్, హేమలత, సోహన్ సింగ్, ఉమా శ్రీధర్, దొంతుల ప్రభాకర్, ఏనుగు రాజిరెడ్డి, సోమేశ్ నాయుడు, రాజు యాదవ్, శాంతి కిరణ్, ఏనుగు సీతారామరెడ్డి, నర్సిరెడ్డి, రణం సిద్దేశ్వర, ఎం.ఎన్. చారి, సురేష్ ధర్మాకర్, వంశీ, నవీన్, ప్రశాంత్, మంజుల, పృథ్వీ, రత్న, మురళి, ఆంజనేయులు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.ర్యాలీ ముగింపు సందర్భంగా ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు



# పేదల హక్కుల సాధనకై సిపిఐ పాదయాత్ర

- సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటపల్లి శంకర్

**కుషాయిగూడ, మహా :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ నిర్వహిస్తున్న పాదయాత్రను పురస్కరించుకొని బుధవారం జవహర్ నగర్ లోని గిరి ప్రసాద్ నగర్ లో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పది రోజులుగా మిషన్ భగీరథ నీరు మురికి మయంగా వస్తున్నా అధికారులకు పట్టింపులేదని ప్రజల అనారోగ్యం పాలవుతుంటే కనువిప్పు కలుగుతలేదా? అంటూ ప్రశ్నించారు. ఏళ్లు గడుస్తున్నా డ్రైనేజీ, సిసి రోడ్డు లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని దుయ్యబట్టారు. అనారోగ్యానికి గురైన సిపిఐ గిరి ప్రసాద్ శాఖ కార్యదర్శి సత్యంను పలువురు నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నరసింహ, యాదగిరి, వెంకటాచారి, స్వరూప రవి నాయక్, కుమార్, కురుమయ్య, మల్లికా, సూర్యం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# యాప్ ద్వారానే ఎరువుల పంపిణీ

**పాలకుర్తి, ఆగస్టు 12 మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని రైతులకు ఎరువులు పారదర్శకంగా,అవసరానికి అనుగుణంగా, సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ అనే నూతన డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిందని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు .ఈ విధానంలో భాగంగా రేపటి నుండి ఆగస్టు 13 నుండి పాలకుర్తి మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా యాప్ ద్వారానే నిర్వహించబడుతుందని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా,ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతు వివరాలు,సాగు భూమి,పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగుతుంది. దీనివల్ల రైతులకు అవసరమైన ఎరువుల ప్రణాళిక మరింత సమర్థవంతంగా రూపొందించబడటంతో పాటు పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. పాలకుర్తి మండలంలోని రైతులందరూ ఎరువుల కోసం నూతన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ ఎరువుల అవసరం కొరకు ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరడమైనది. ఫార్మర్ ఐడీ ఆధార్, మొబైల్ నంబర్, భూమి వివరాలతో నూతన యాప్ ద్వారా యూరియా బుకింగ్ పూర్తి చేసుకోవాలని సూచించారు.యాప్ వినియోగంలో ఏవైనా సందేహాలు లేదా నమోదు సంబంధిత ఇబ్బందులు ఎదురైనట్లయితే, తమ గ్రామ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి AEO లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని తెలిపారు. రైతులు ఈ నూతన విధానాన్ని సద్వినియోగం చేసుకొని, ఆగస్టు 13 నుండి అమలులోకి రానున్న ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ విధానానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇది ఓ అభాగ్యుని జీవన్మరణ పోరాటం

- ఐస్ క్రషర్ మిషన్‌లో నలిగిన లేత వయసు.. ఆపన్నహస్తం కోసం ఆకాష్ కుటుంబం



**కుషాయిగూడ, మహా:** ఇది ఓ అభాగ్యుని జీవన్మరణ పోరాటం. కదిలిస్తే కన్నీళ్లు తెప్పించే విషాదం. ఐస్ క్రషర్ మిషన్‌లో ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడిన 21 ఏళ్ల కుమ్మరి ఆకాష్ జీవితం అనూహ్యంగా విషాదంలోకి వెళ్లింది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబంపై ఈ ప్రమాదం మరింత పెను భారాన్ని మోపింది. హైదరాబాద్ బేగంబజార్‌లోని అద్దె ఇంట్లో నివసిస్తున్న ఆకాష్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఆకాష్ తండ్రి సుభాష్ మొక్కజొన్న కంకులు కాల్చి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వచ్చే ఆదాయం అంతంతమాత్రంగానే ఉండటంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారింది. సుభాష్‌కు ఇద్దరు కుమారులు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇద్దరూ తమకు దొరికిన పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో ఆకాష్ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఐస్ క్రషర్ మిషన్‌లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. మోచేయి వరకు తీవ్ర గాయాలు కావడంతో పాటు అధిక రక్తస్రావం జరిగింది. వెంటనే యజమాని ఆకాష్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించడంతో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. చికిత్స ప్రారంభమైన మూడో రోజున ఆకాష్‌కు ఒక కిడ్నీ విఫలమైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి ఈ వార్త పిడుగులా మారింది. మరో 19 రోజుల చికిత్స అనంతరం రెండో కిడ్నీ కూడా విఫలమైనట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ఆకాష్ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ప్రస్తుతం ఆకాష్‌కు నిరంతర వైద్య సేవలతో పాటు డయాలసిస్ అవసరమవుతోంది. చికిత్సకు అవుతున్న ఖర్చు కుటుంబానికి భారంగా మారింది. అద్దె ఇంట్లో నివసిస్తూ పరిమిత ఆదాయంతో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం ఇప్పుడు ఆకాష్ వైద్య ఖర్చుల కోసం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆకాష్ వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఆకాష్ ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమకు తోచినంత సాయం చేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్న సహాయం కూడా ఆకాష్ చికిత్సకు పెద్ద అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం చేయదలచిన దాతలు 8341142585 నంబర్‌కు ఫోన్ చేసి ఆకాష్ కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని కోరుతున్నారు.



# సిమెంట్ ఇటుకతో కొట్టి భార్యను హతమార్చిన భర్త

**ఘట్‌కేసర్, మహా :** ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ద్వారకానగర్, మినర్వా స్కూల్ సమీపంలో దారుణం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన భర్త కాట్రావత్ రాజు (44) భార్యపై అనుమానంతో పెద్ద సిమెంట్ ఇటుకతో ఛాతీపై బలంగా బాదాడు. తీవ్రంగా గాయపడిన భార్య మాధవి (37)ని కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అర్ధరాత్రి 1.30 గంటలకు మాధవి మృతి చెందినట్లు ధృవీకరించారు. వనపర్తి జిల్లా కిలగనపూర్ మండలం సలకలపూర్‌కు చెందిన మాధవికి 18 ఏళ్ల క్రితం రాజుతో వివాహమైంది. గత 15 సంవత్సరాలుగా ఈ దంపతులు ఘట్‌కేసర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత మూడేళ్లుగా రాజు మద్యానికి బానిసై భార్యను అనుమానించి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని మాధవి సోదరుడు ఇస్లావత్ మాన్య ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు చేసినా రాజు ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు రాజుపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఘట్‌కేసర్ పోలీసులు తెలిపారు.



# ఆది శ్రీనివాస్‌పై బురదజల్లొద్దు: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ,మహా:** వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తుం మధు మాట్లాడారు. హిందూ మతాన్ని అడ్డుపెట్టుకుని గెలిచిన బీజేపీ నాయకులు తమ స్థాయి మరచి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ విప్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దేవుని పేరుతో వందల కోట్లు దండుకున్నది బీజేపీ నేతలేనని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజన్న ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడ పట్టణాభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. ఆలయ సమగ్ర అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులతో పట్టణ రూపురేఖలు మారుతున్నాయని, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నాయకత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మౌలిక వసతుల కల్పనకు సలహాలు ఇవ్వాల్సింది పోయి, అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదన్నారు. ముప్పై ఏళ్లుగా జరగని అభివృద్ధి మూడేళ్లలో జరుగుతుంటే బీజేపీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్‌తో పాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- హర్ ఘర్ తిరంగాతో దేశభక్తి పెంపొందించాలి

**రాజేంద్రనగర్ మహా :** జిహెచ్ఎంసి పరిధి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శంషాబాద్ డివిజన్ లలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బిజెపి నాయకులు అడికె జనార్ధన్, బైతీ శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి గడుపకు జాతీయ పథకాన్ని పంపిణీ చేశారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా' అనేది భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరేసేలా దేశభక్తిని పెంపొందించాలి. జాతీయ జెండాపై గౌరవాన్ని చాటడానికి భారత ప్రభుత్వం దీనిని నిర్వహిస్తోందన్నారు. ముఖ్య ఉద్దేశాలు... ప్రతి ఇంటికి జాతీయ జెండాను తీసుకురావడంతో ప్రజల్లో దేశభక్తి భావాలను మరింత పెంచడం.జాతీయ జెండాతో ప్రతీ పౌరుడికి వ్యక్తిగత బంధం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, సంతోష్‌గౌడ్, రావుల భాస్కర్, సర్పంచ్ సుభాష్, ఉప సర్పంచ్ విజయ్ కుమార్ యాదవ్, రాజు, నందు, వడ్డే చంద్రయ్య, నరసింహ్మ,శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య, శ్రీధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీను గౌడ్, శేఖర్, మహేందర్, సిద్దేశ్వర గౌడ్, నర్సింగ్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నావార్ మురళీధర్ రెడ్డి, వెంకటరమణ గుప్తా బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సర్ ప్రక్రియ శంషాబాద్ మండల పరిధిలో 83.95%

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండల పరిధిలో ఓటర్లు 32748, ఉండగా సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు నింపి తిరిగి అధికారులకు అందజేసిన వారి సంఖ్య 27488, (83.95%) నమోదయింది. ఎన్యూమరేషన్ ఫారాలు నింపి తిరిగి ఇవ్వని వారి సంఖ్య 5255, (16.05 ),మండలంలో చనిపోయిన వారి సంఖ్య 621, షిఫ్ట్ అయిన వారి సంఖ్య 2744, డబుల్ ఓట్లు సంఖ్య 826, అడ్రస్సు లేని వాళ్ళ సంఖ్య 1051, గా ఉన్నాయి అని అధికారులు తెలిపారు.



## వేటగాళ్ల ఉచ్చుకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బలి

**వెంకిట్యా తండాలో అలుముకున్న విషాదచాయలు**

**కారేపల్లి, మహా :**వేటగాళ్ల ఉచ్చుకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బలయ్యారు. బూర్గంపాడు మండలంలో పని చేస్తున్న బానోత్ నవీన్ విధినిర్వహణలో అశువులు బాసాడు. ఫారెస్ట్ ప్లాంటేషన్ లో వేటగాళ్లు అడవిజంతువుల వీటికోసం విద్యుత్ ఉచ్చులు అమర్చుతున్నారని సమాచారం రావడంతో నవీన్ తో పాటు మరో నలుగురు అటవీ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లిన సమయంలో ముందు ఉన్న నవీన్ కాలు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషాదంలో మాజీ ఎంపీపీ దేవులా కుటుంబంవిధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మాజీ ఎంపీపీ దేవులానాయక్ కుమారుడు. కుమారుడిని కోల్పోవటంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో రోదిస్తుంది. స్వగ్రామమైన వెంకిత్యతండా లో విషాదచాయలు అలుముకున్నాయి.

# ఎరువుల కొరత లేకుండా చూడాలి

- **బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు**
- **కలెక్టర్ హెచ్చరిక**



**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వర్షాకాల సాగు నేపథ్యంలో బుధవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని యూరియా గోదామును, యూరియా బుకింగ్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గోదాములో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ వివరాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతుల నమోదులు, బుకింగ్ విధానం, పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బుకింగ్ ప్రక్రియలో రైతులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలని, యాప్ సమర్థవంతంగా పనిచేసేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ బుకింగ్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిస్థాయి పారదర్శకతతో జరుగుతోందని, దీంతో బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఎరువులను (ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం లేదా పక్కదారి పట్టించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.రైతులు తమకు అవసరమైన మేరకే ఎరువులను కొనుగోలు చేయాలని, ఒకేసారి అధిక మొత్తంలో నిల్వ చేసుకోవద్దని సూచించారు. సహకార సంఘాల ద్వారా ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు.ఈ పరిశీలనలో పీఏసీఎస్ సిబ్బంది పూర్ణ చందర్, రైతులు తదితరులున్నారు.



## సీతారాం ఏచూరి ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి

- **కాకర్లపల్లి గ్రామంలో 74వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు.**

**సత్తుపల్లి, ఆగస్టు 12**: మహా: సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా బుధవారం కాకర్లపల్లి గ్రామంలో సీపీఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమం నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చిన సీతారాం ఏచూరి దేశ రాజకీయాల్లో విశిష్టమైన పాత్ర పోషించారని తెలిపారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన ఆయన, 1975లో సీపీఎంలో చేరి ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభించారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడి అరెస్టయిన ఆయన అనంతరం జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మూడుసార్లు ఎన్నికయ్యారని గుర్తుచేశారు. కార్మికులు, రైతులు, పేదలు, విద్యార్థులు, యువత హక్కుల కోసం.. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ, కేంద్ర సెక్రటేరియట్, పొలిట్ బ్యూరోలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన 2015లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 2024 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారని తెలిపారు. విభిన్న రాజకీయ శక్తులతో ప్రజాస్వామ్య, లౌకిక ఐక్యత కోసం ఏచూరి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం, కార్మిక-కర్షక ఐక్యతను ముందుకు తీసుకెళ్లడం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఏచూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, కాకర్లపల్లి సర్పంచి పొదిలి మారేశ్వరావు, టీఆర్ఎస్ నాయకుడు కొప్పుల రమేష్, మండల కమిటీ సభ్యులు వేపులపాటి కుమారస్వామి, బండి వేలాద్రి, కావూరి వెంకటేశ్వరరావు, అయినంపూడి సనందరావు, దాట్ల రాంబాబు, ఆంగోతి చిట్టెమ్మ, సత్యవతి, పుష్పావతి, లక్ష్మి, పమ్మి వెంకటేశ్వర రావు, బెజవాడ రాము తదితరులు పాల్గొన్నారు.



## మండల అభివృద్ధి ప్రణాళిక పై సమావేశం

- **మండల సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలి**
- **ఎంపీడీవో తాళ్లూరి రవి**

**జూలూరుపాడు, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఎంపీడీవో రవి అధ్యక్షతన బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మండల అభివృద్ధి ప్రణాళికను రూపొందించే క్రమంలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న నిధులు, ప్రతిపాదిత కార్యక్రమాలు, అవసరమైన నిధులు, శాఖల మధ్య సమన్వయంతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరిగింది. 202627 సంవత్సరానికి తమ శాఖల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు, ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉన్న నిధులు, ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, ప్రతి పాదిత పనులు తదితర వివరాలను మండల అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచాలని సంబంధిత శాఖల ధికారులను ఎంపీడీవో రవి కోరారు. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో ప్రస్తుతం ప్రత్యేకంగా బీపీడీపీ కోసం కేటాయించిన నిధులు అందుబాటులో లేవని తెలియజేశారు. అదే విధంగా తమ శాఖల ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వ పథకాల పరిధిలోని నిధులను ఆయా శాఖల కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు వివరించారు. మండల అభివృద్ధి ప్రణాళికలో గుర్తించిన అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా, అందుబాటులో ఉన్న వివిధ శాఖల నిధులను కన్వర్జెన్సు, సమన్వయ విధానంలో వినియోగించుకునే అవకాశాలను పరిశీలించి, మండల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలని సమావేశంలో అధికారులను ఎంపీడీవో కోరడం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## చెట్ల పెంపకంతో స్వచ్ఛమైన ఆక్సిజన్

- **అదనపు కలెక్టర్ వేణుగోపాల్**
- **సెయింట్ ఆండ్రూస్ స్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**చెట్లను పెంచడం వల్ల వాటి నుండి స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించడంతోపాటు ఆరోగ్యపరంగా కూడా ఉపయోగం ఉంటుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం పోస్ట్ ఆఫీస్ సెంటర్లోని సెయింట్ ఆండ్రూస్ హైస్కూల్లో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ టీం ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొని స్కూల్లో మొక్కను నాటిన అనంతరం ప్రసంగించారు. మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. చెట్ల పెంపకం వల్ల స్వచ్ఛమైన గాలి నీడ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకటపుల్లయ్య, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, మొక్కల వెంకటయ్య, టాటా సంస్థ డిడిఓఏ జితేంధ్ర ఫణి, ఎంపీబీఏ రామగోపి, బ్రాంచ్ మేనేజర్ సతీష్ జక్కుల, అడ్వైసర్స్ బిజినెస్ అసోసియేట్స్ సిఎస్ఐ చర్చి ఫాస్టర్ అభిజిత్, హెడ్ మాస్టర్ రవి రత్న రాజు, కమిటీ సభ్యులు వినయ్, మల్లికార్జున్, చందు కావ్య, జోత్న, కిరణ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజర్ గా సీనియర్ బిజినెస్ అసోసియేట్ టాటా ఏఐఏ కమల రాణి కొచ్చెర్ల వ్యవహరించారు.

## ప్రిన్సిపాల్ భజనలో అధ్యాపకులు

- **బోధన కంటే భజనకే ప్రాముఖ్యత**
- **అటెండరే ఇక్కడ అధ్యాపకుడు**
- **పర్యవేక్షణ లోపం కళాశాలకు శాపం**



**కారేపల్లి, మహా :** కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేయాల్సిన గురువులు,ప్రధానాచార్యులకు బాకాలుగా మారి ఆమె ప్రాపకం కోసం భజనలతో కాలక్షేపం చేస్తుండడం విద్యార్థులు చదువులపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కోటరీ ఏర్పాటు చేసుకొని కోటరికి ప్రత్యేక సదుపాయాలు, వెసులు బాట్లు కల్పించటం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. కోటరీలోని వ్యక్తులు సమయపాలన పాటించకున్నా, పాఠాలు బోధించకున్నా ఎవరికి పట్టనట్టు ఉందని విద్యార్థులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. విద్యార్థులకు ఆంగ్లం బోధన ఎంతో ప్రాముఖ్యతో ఉందో తెలిసికూడా కళాశాలలో ఉన్న జనరల్, ఒకేషనల్ గ్రూపులన్నింటిని కలిపి రెండు పిరియడ్లతో సరిపుచ్చటం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవటం కాదా ? 111 మంది విద్యార్థులను హాల్ లో కూర్చోబెట్టి సెమినార్ చెప్పినట్లు చెప్పితే ఎవరికి అర్థం అవుతుందో ఆ అధ్యాపకురాలు, ప్రిన్సిపాల్ కే తెలియాలి. రోజు రెండు పిరియడ్ లు భోధించి తర్వాత కాలక్షేపంతోనే సరిపుచ్చుకోవటం ఆ కళాశాల గురువులకే చెల్లుతుంది. ఇంగ్లీషుకు స్టడీ అవర్ అనే మాటే లేదు.

**ల్యాబ్ అటెండరే అధ్యాపకుడు**

ల్యాబ్ లో సహాయకునిగా ఉండే అటెండర్ తో విద్యాబోధన వింతగా ఉంది. ఎంపీహెచ్ డబ్ల్యూ కు ఒకరే అధ్యాపకులు ఉన్నారు. ఆ గ్రూపులో విద్యాబోధనకు సైన్స్ అధ్యాపకులకు అదనపు బాధ్యతలు అప్పగించాల్సిన ప్రిన్సిపాల్ కు పట్టకపోవటంతో ల్యాబ్ అటెండరే అధ్యాపకుడిగా మారాడు. ఇక పిల్లలేమో అటెండర్లుగా మారి సేవలు చేస్తున్నారు. గతంలో కళాశాలలకు విద్యార్థులు సెల్ పోన్ తీసుకవస్తేనే అప్పటి ప్రిన్సిపాల్ సహించేవారు కాదు. అలాంటిది కారేపల్లి కళాశాలలో అధ్యాపకులే పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వటం విడ్డూరంగా ఉంది. గురువులు, శిష్యుల మధ్య ఉండే సంబంధం ఎంతో పవిత్రమైనది. అలాంటిది కళాశాలలో విద్యార్థులపై చెప్పులు విసరటం, బూతులు తిట్టటం నేటి కారేపల్లి కళాశాల అధ్యాపకుల తీరు. ఇక కళాశాలలో వార్షిక పరీక్షా ఫలితాలలో పూర్ ఫలితాలు రావటం, అనంతరం జరిగే సప్లిమెంటర్ పరీక్షలలో మాత్రం ఉత్తీర్ణత శాతం అమాంత పెరగటం విశేషం, రహస్యం ఏమిటో ప్రిన్సిపాల్, వారికి భోదించే అధ్యాపకులకే తెలియాలి.

**పర్యవేక్షణ లోపం కళాశాలకు శాపం**

కళాశాలపై పర్యవేక్షణ లోపం విద్యార్థుల భవిష్యత్తుకు శాపంగా పరిణమించింది. కళాశాలకు వస్తున్న అధికారులు విద్యాభోధన, అవసరాలు. సమస్యలను విద్యార్థులతో చర్చించే తీరిక ఉండటం లేదు. మొక్కుబడి తనిఖీలతో వచ్చామా? పోయామా అనే రీతిలో ఉండటంతో బాధ్యతరహిత్యం పెరిగిపోయింది. దీంతో పిల్లలకు కొంతైనన్యాయం చేద్దామనుకునే అధ్యాపకులలో ఆసక్తి సన్నగిల్లే పరిస్థతి వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కారేపల్లి ప్రభుత్వకళాశాలలో జరిగే పరిణామాలు, విద్యాబోధన పై దృష్టి పెట్టి పిల్లల భవిష్యత్తుకు బాటలువేయాలని విద్యావేతలు కోరుతున్నారు.



## వినతిపత్రం అందజేత

**క్యాతనపల్లి మహా :** మున్సిపాలిటీ పరిధిలోని పలు వాడల్లో ఉన్నటువంటి సమస్యల పట్ల కమిషనర్ కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. వాడల్లో మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య పనులు వీధి దీపాలు వాటి సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నట్లు పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## పుస్తక పఠనంతో ఎంతో మేలు

- **జందాపూర్ లో లైబ్రరీ ప్రారంభం**

**ఆదిలాబాద్ మహా** : పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకున్న వారే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని, గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు, విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటంతో పాటు సమాజంలో సానుకూల మార్పులకు దారి తీస్తుందని పేర్కొన్నారు.చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనమని, యువత తమ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ తరహాలోనే ఇతర ప్రాంతాల్లో కూడా త్వరలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లువెల్లడించారు.గ్రామఅభివృద్ధికిఅవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జందాపూర్ గ్రామంలో రహదారి సమస్యను ఆర్ అండ్ బీ అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని, గ్రామానికి నూతన అంగన్వాడీ భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.పరిశుభ్రత ప్రతి గ్రామ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, గ్రామ సర్పంచ్ బత్తుల గంగమ్మ, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, తహసీల్దార్ గోవింద్, డీఎల్పీఓ ఫణిధర్, ఎంపీడీఓ కృష్ణవంశీ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## బైక్ దొంగల ముఠా గుట్టు రట్టు

**ఆదిలాబాద్ మహా:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనాలపై అందిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, సిసిటీవీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితులు గత కొంత కాలంగా మరికొందరితో కలిసి ముఠాగా ఏర్పడి అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇచ్చోడ, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో సుమారు 44 ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు వెల్లడించారు.దొంగిలించిన వాహనాల నంబర్ ప్లేట్లను మార్చి, ఇతరులకు విక్రయించినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. నిందితుల సమాచారం మేరకు పోలీసులు 44 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.5 గురు దొంగలతో పాటు దొంగ బండ్లు కొనుగోలు చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసి మరో 23 మందిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.వాహన యజమానులు తమ ద్విచక్ర వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసి తప్పనిసరిగా తాళాలు వేయాలని, వీలైనంత వరకు సీసీటీవీ కెమెరాలు ఉన్న ప్రదేశాల్లోనే వాహనాలను పార్క్ చేయాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఇచ్చోడ పోలీసులు సాంకేతిక ఆధారాలతో చాకచక్యంగా దర్యాప్తు చేసి అంతర్రాష్ట్ర బైక్ దొంగతనాల ముఠాను పట్టుకుని 44 ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడ ఎస్‌హెచ్ఓ కె. నరేష్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 35 వేలకుపైగా జనాభా.. యూపీహెచ్‌సీ కావాల్సిందేనా?

**క్యాతనపల్లిలో ప్రత్యేక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం ప్రజల డిమాండ్**




**క్యాతనపల్లి, మహా :** సుమారు 35 వేలకుపైగా జనాభా ఉన్న క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రత్యేక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలన్న డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. ప్రాథమిక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం సాధారణ జ్వరాలు, వైరల్ వ్యాధులు, గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, చిన్నారుల టీకాలు, మధుమేహం, రక్తపోటు తదితర ప్రాథమిక వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోనే యూపీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని అంటున్నారు. పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తరణ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని క్యాతనపల్లిలో ప్రత్యేక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ, ప్రజాప్రతినిధులు స్పందించాలని, చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అనుకూల స్థలం ఉంటే ప్రతిపాదన పెడతాం**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుకూలమైన ప్రభుత్వ స్థలం ఉంటే ఈ అంశాన్ని పరిశీలిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, జాతీయ ఆరోగ్య మిషన్ మార్గదర్శకాలు, అందుబాటులో ఉన్న నిధులు, భవనం, వైద్య సిబ్బంది, సమీపంలోని ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందుతున్న సేవలు తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లభిస్తే కొత్త ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుని ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

**జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్**



## బుల్లెట్ రైలు కారిడార్‌లో నకిరేకల్‌ను చేర్చాలి

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ/ యాదాద్రి భువనగిరి, మహా:** ప్రతిపాదిత హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ రైలు (బుల్లెట్ రైలు) కారిడార్‌లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కూడా చేర్చే విషయాన్ని పరిశీలించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్‌కు బదులుగా ఇప్పటికే ఉన్న ఎన్ హెచ్ 65 కారిడార్ గుండా ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను పరిశీలిస్తే, ఆ ప్రాంతంలోని ఇప్పటికే ఉన్న పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు, పెద్ద సంఖ్యలో జనాభాకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని ఎంపీ అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో, కారిడార్‌ను కొత్త మార్గంలో కాకుండా ఇప్పటికే ఉన్న ఎన్ హెచ్ 65 మీదుగా మళ్లించడం వల్ల నకిరేకల్ ప్రజలకు, అలాగే విస్తృత భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఈ ప్రతిష్టాత్మక హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ ద్వారా అధిక ప్రయోజనాలు చేకూరుతాయని చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనను అనుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన రైల్వే శాఖను కోరారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ సాయి కుటుంబాన్ని ఆదుకుంటాం

- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తాం..
- రూ.22లక్షల పరిహారం.. తక్షణ సాయం కింద రూ.10లక్షలు అందజేస్తాం..
- ఇందిరమ్మ ఇల్లుతో పాటు తండ్రికి పెన్షన్ సౌకర్యం...
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హామీ...



**ఎల్బీనగర్ ఆగస్టు 12 మహా:** ఎన్నో కలలతో ఉద్యోగంలో చేరి, అర్థాంతరంగా తనువు చాలించిన బండాలేమూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సాయి ఆత్మహత్య ఘటనపై ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు, బంధువులతో మాట్లాడిన ఆయన... దుర్ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. విధి నిర్వహణలో సాయిని ఇబ్బందికి గురిచేశారన్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. ఈ మేరకు మల్కాజ్ గిరి సీపీ, డీసీపీతో మాట్లాడారు. సాయి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న ఎమ్మెల్యే... ప్రత్యేక చొరవతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే, రూ.22లక్షలను ప్రభుత్వం నుంచి అందజేయనున్నట్లు ప్రకటించిన ఆయన... తక్షణ సాయం కింద రూ.10లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. తన నియోజకవర్గానికి చెందిన సాయి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుతో పాటు తండ్రికి పెన్షన్ వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఉన్న కోటి రూపాయల బీమా సాధ్యపడే అవకాశం లేకపోవచ్చన్న మల్ రెడ్డి... దీనిపై సీఎంతో ప్రత్యేకంగా మాట్లాడతానన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి, ఉన్నతాధికారుల హామీ మేరకు కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రాంరెడ్డి, పగడాల యాదయ్య, బండలేమురు గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## పాఠశాలకు మైక్ సెట్ అందజేత

**వలిగొండ ఆగస్టు 12 మహా న్యూస్** మండలంలోని దుప్పెల్లి సి ఆర్ బి ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన గందె నరసయ్య గందే రమేష్ గందె రవీందర్ గందె రఘువరన్ వారి తల్లిదండ్రులు గందె గోరయ్య బకమ్మల జ్ఞాపకార్థం పాఠశాలకు 20వేల రూపాయల మైక్ సెట్ ను అందజేయడం పట్ల మండల ఎంఈఓ సుంకోజు భాస్కర్ పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం విజయ మైక్ సెట్ అందజేసిన దాతలకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో చక్కగా చదువుకొని పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సయ్యద్ జావీద్ పాషా ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## నేడు విద్యుత్ అంతరాయం

**లిగొండ విద్యుత్ ఏఈ నరసింహ**

**వలిగొండ ఆగస్టు 12 మహా న్యూస్ :** వలిగొండ మండలంలోని వేములకొండ వెంకటాపురం ముద్దాపురం గోపరాజు పల్లి దుప్పల్లి గ్రామాలకు నేడు గురువారం విద్యుత్తు మధ్యాహ్నం 12 గంటల నుండి నాలుగు గంటల వరకు నిలిపి వేయబడుతుందని వినియోగదారులు రైతులు సహకరించాలని విద్యుత్ ఏఈ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు

## జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసు

**న్యూఢిల్లీ, మహా :** ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు నగదు వ్యవహారంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అధికారిక నివాసంలో భారీగా కాలిపోయిన నగదు లభించిన కేసులో వర్మ వివరణ సంతృప్తికరంగా లేదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన కమిటీ తేల్చింది. ఈ మేరకు బుధవారం పార్లమెంటులో సమర్పించిన నివేదికలో ఆయన్ను దోషిగా పేర్కొంది. 2025 మార్చి 14న ఢిల్లీలోని తుగ్లక్ క్రెసెంట్‌లో ఉన్న వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. మంటలు ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి ఓ స్టోర్‌రూమ్‌లో భారీగా కాలిపోయిన రూ.500 నోట్ల కట్టలు కనిపించాయి. నగదు అక్కడికి ఎలా వచ్చింది? దాని మూలం ఏంటి? ఎవరిది? అనే అంశాలపై వర్మ ఇచ్చిన వివరణను కమిటీ తిరస్కరించింది. వర్మ ఇచ్చిన సమాధానాల్లో పారదర్శకత లేదని కమిటీ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై 2025 మార్చి 22న ఆయన ఇచ్చిన వివరణ కూడా సంతృప్తికరంగా లేదని నివేదికలో పేర్కొంది. అయితే కీలక విషయమొకటి కూడా కమిటీ స్పష్టం చేసింది. నగదును వర్మ స్వయంగా అక్కడి నుంచి తొలగించారనడానికి ఆధారాలు లభించలేదని తెలిపింది. నగదు లభించిన తర్వాత దర్యాప్తులో ఆధారాలను సరిగ్గా భద్రపరచలేదని కమిటీ తప్పుబట్టింది. స్టోర్‌రూమ్‌ను చట్టబద్ధంగా సీల్ చేసి తనిఖీ చేయకముందే అక్కడి సిబ్బంది కదలికలతో కీలక ఆధారాలు దెబ్బతిన్నాయని పేర్కొంది. అనంతరం నగదు కనిపించకుండా పోవడం లేదా అందుబాటులో లేకపోవడానికి కారణం కూడా స్పష్టంగా తెలియలేదని తెలిపింది. అప్పటి సీజేఐ సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ కూడా వర్మకు ఆ స్టోర్‌రూమ్‌పై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నియంత్రణ ఉందని తేల్చింది. వివాదం తర్వాత వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిరిగి పంపారు. అనంతరం ఆయన రాజీనామా చేశారు

## ప్రజల గడపకే సంక్షేమం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మార్నింగ్ వాక్ లో ఇంటింటి తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తున్న కౌన్సిలర్ బర్రె పూజిత- జహంగీర్



**భువనగిరి ఆగస్టు 12 మహా:** భువనగిరి మున్సిపల్ లోని 23వ వార్డులో కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ ఆధ్వర్యంలో బుధవారం 'గడప గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా వార్డులోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రేషన్ కార్డులు లేని కుటుంబాలు, రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు కాని వారు, పింఛన్లు అందని అర్హులైన ఒంటరి , వితంతువులు,చేనేత,గౌడ, టీబీ, ఫైలేరియా తదితరుల వివరాలను సేకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనాలు అందనివ్వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఇబ్బందులను తెలుసుకోవడం ద్వారా ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువవుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. "ప్రజల సమస్యే మా సమస్య.. ప్రజల ఇంటి గడపే మా కార్యాలయం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందే వరకు ప్రజల తరఫున మా పోరాటం కొనసాగుతుంది" అని బర్రె పూజిత జహంగీర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారికి న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె వెంట గాయపాక వెంకటేష్,బర్రె క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల

- అజయ్ కుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ




**మొయినాబాద్ మహా:** వెంకటాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెంకటాపూర్ సర్పంచ్ అర్చనా అజయ్ రెడ్డి అన్నారు. వెంకటాపూర్ గ్రామ యువ నాయకుడు పెద్దవేటి అజయ్ కుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్చనా అజయ్ రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలను కేక్ కటింగ్, శాలువాలకే పరిమితం చేయకుండా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు, షూస్, పెన్నులు, క్రీడా సామగ్రి వంటి అవసరమైన వస్తువులను అందించాలని కోరారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే బాత్రూమ్స్, ప్రహరీ గోడ, పెయింటింగ్, గేటు, పాఠశాల ముఖద్వారం తదితర పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు సర్పంచ్ తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి, ప్రభుత్వ పాఠశాలను మరింత అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ వెంకటాపూర్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు ఉప సర్పంచ్ ఎలుగుల ప్రభాకర్, వార్డు సభ్యులు దుద్యాల నర్సింహా, స్వాతి మురళి, కల్పన మహేందర్, నిర్మల సురేష్, అలాగే నాయకులు ఎలుగుల యాదగిరి, లక్ష్మారెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీను, వికాస్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పరకాలలో ఘనంగా తిరంగా ర్యాలీ

- భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు వెల్లివిరిసిన దేశభక్తి
- హాజరైన డాక్టర్. పగడాల కాళీ ప్రసాద్ రావు

**పరకాల, మహా :** భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పరకాల పట్టణంలో తిరంగా ర్యాలీ పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ పరకాల రూరల్ అధ్యక్షులు కసగాని రాజ్ కుమార్ వీరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి బస్టాండ్ కూడలి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని విద్యార్థులు వందేమాతరం ఆలపిస్తూ దేశభక్తిని చాటుకున్నారు. వివిధ దేశభక్తి, జాతీయతను ప్రతిబింబించే వేషధారణల్లో విద్యార్థులు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎన్సిసి విద్యార్థులు నిర్వహించిన క్రమశిక్షణతో కూడిన పరేడ్ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. త్రివర్ణ పతాకాన్ని చేతబూని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, ఉత్సాహం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతదేశం పట్ల తమకున్న గౌరవాన్ని, జాతీయ పతాకం పై ఉన్న అభిమానాన్ని విద్యార్థులు చాటుకున్నారు. ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తు. విద్యార్థుల శక్తి, ప్రతిభ, క్రమశిక్షణ, దేశభక్తితోనే భారతదేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశభక్తిని చాటుతూ విద్యార్థులు నిర్వహించిన తిరంగా ర్యాలీ పరకాల పట్టణంలో జాతీయ స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణ రావు గారు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పి జయంతి లాల్, దేవునూర్ మేఘనాథ్, జిల్లా కోశాధికారి రామన్న, పరకాల కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, బెజ్జంకి పూర్ణ చారి, ఆకుల లావణ్య శ్రీధర్, నాయకులు చందుపట్ల రాజేందర్రెడ్డి పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, పట్టణ మండల ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, పి.మల్లారెడ్డి, టి కిరణ్, దంచనాదుల కిరణ్, సోషల్, పరకాల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, స్పెషల్ మీడియా కన్వీనర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## స్వయం సహాయక సంఘ మహిళలకు ఆరోగ్య పరీక్షలు

**ఆలేరు ఆగస్టు 12 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజిపేట గ్రామంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా అందించనున్న ఉచిత ఆరోగ్య పరీక్షలను బుధవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమ కుటుంబాల సంక్షేమంతో పాటు ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా అవసరమైన ఆరోగ్య పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల మహిళలు తమ ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకుని తగిన వైద్యం పొందేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీర్ల అయిలయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు, డిఆర్డిఏ జిల్లా అధికారి,గ్రామ సర్పంచ్ మధు, డాక్టర్లు పాల్గొన్నారు




## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి

- ఏలే చంద్రశేఖర్ బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు

**వలిగొండ ఆగస్టు 12 మహా న్యూస్ :** హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏలేచంద్రశేఖర్ అన్నారు . బుధవారం తిరంగా ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర స్ఫూర్తిని ప్రతి ఇంటికి తీసుకెళ్లే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించాలని దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ జాతీయ జెండాపై గౌరవాన్ని చాటే విధంగా ప్రతి కుటుంబం తమ ఇంటిపై జాతీయ జెండా ఎగర వేయాలని కోరారు త్రివర్ణ పతాకం మన దేశ స్వాతంత్రాన్ని ఐక్యతకు సర్వ బహుమత్వానికి ప్రతీక అని యువత మహిళలు విద్యార్థులు వ్యాపారులు ఉద్యోగులు వివిధ సంఘాల ప్రతినిధులు ప్రజాప్రతినిధులు అందరు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసే విధంగా కృషి చేయాలని అన్నారు . బిజెపి మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వలిగొండ సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి బిజెపి సీనియర్ నాయకులు రాచకొండ కృష్ణ బందారపు రాములు రాస వెంకట్ మైసొల్ల రామ నర్సు బచ్చ శ్రీనివాస్ మైసొల్ల మచ్చ గిరి నాగరాజు రంజిత్ రెడ్డి లో డే లింగస్వామి వెంకటేశం మహేష్ శ్రీనివాస్ నరసింహ మత్స్యగిరి కిట్టు వెంకటేశం జంగయ్య తదితరులు పాల్గొన్నారు



## ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, బ్యూరో మహా :** వరంగల్ నగరం లోని ఎంజీఎం ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం సందర్శించి ఆస్పత్రిలోని కంప్లైంట్ బాక్స్‌ను పరిశీలించారు. అనంతరం వివిధ వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం అందుతున్న తీరు పై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు, సమస్యల పై వివరాలను తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఎంజీఎం డైట్ సెంటర్‌ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు అందించే డైట్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జిలను ఆదేశించారు. ఇటీవల వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి పై అనేక ఆరోపణలు, నెలకొన్న సమస్యలు పత్రికలో అలాగే ప్రచార మాధ్యమాలలో వస్తున్న కథనాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎంజిఎంను సందర్శించినట్లు సమాచారం.ఈ సందర్శనలో ఎంజీఎం సూపరిండెంట్ డాక్టర్ రామ్ కుమార్,డాక్టర్ అశ్విన్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## తాజ్ పూర్ లో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

- 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి
- గొర్రెల మేకల పెంపకార్ల సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ



**భువనగిరి ఆగస్టు 12 మహా:** చెంగిచెర్లలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం 4 వ రాష్ట్ర మహాసభ ఆగస్టు 22, 23, 24 తేదీలలో జరగనున్నాయని వాటిని జయప్రదం చేయాలని కోరుతూ తాజ్ పూర్ గ్రామంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొర్రెల మేకల పెంకుందర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల నరసింహ మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపొందారుల సంఘం ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తయిందని ఈ సందర్భంగా నిర్వహించే 4 వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చెంగచెర్ల లో నిర్వహిస్తున్నామని అన్నారు. 1995 సంవత్సరంలో సంఘం ఏర్పడిందని, వాటి నుంచి నేటి వరకు అనేక పోరాటాలు చేసి, ముఖ్యంగా తుమ్మ చెట్లపై గొర్ల కాపరులకు హక్కు కల్పించే 1016 జీవో, మేతకు ప్రభుత్వ భూములు కేటాయించాలని 559 జీవో సాధించినట్లు తెలిపారు. గొర్రెలకు ఉచితంగా మందులు పంపిణీ చేసేందుకు కృషి చేసిందన్నారు. గతంలో గొర్రెలకు ఇన్సూరెన్స్, ఎన్సిడిసి రుణాల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేయగా, సబ్సిడీ గొర్రెల్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో గొల్ల కురుమలకు అవకాశం కల్పించి, యువతకు గొర్ల ఫామ్ షెడ్, గొర్రెల కొనుగోలు కోసం నేషనల్ లైవ్ స్టాక్ లో ప్రత్యేకంగా రాయితీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపందారుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవునూరి బాల్లయ్య, పాక జహంగీర్, దొడ్డి కొమరయ్య గొర్ల కాపరుల సంఘం అధ్యక్షులు ర్యాకల శ్రీనివాస్, గొర్ల కాపరుల సంఘం సభ్యులు సోమన బాలయ్య, సోమన నగేష్, బిట్కూరి రమేష్, ర్యాకల నరసింహ, బిట్కూరి రామ్ లక్ష్మణ్, బాంద్ర రవి, గుల్లని జంగయ్య, సురేష్, సోమన శివలింగం, బీట్కూరి లక్ష్మయ్య, దేవు నూరి భాస్కర్, ఓంకార్, ర్యాకల జంగయ్య గొర్ల కాపరులు లు పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా సాగునీటి ప్రణాళిక

**ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటలకే ప్రాధాన్యం**

**వనపర్తి, మహా :** రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుల కింద ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. వనపర్తిలో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశంలో జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్, ఆర్డీఎస్, కల్వకుర్తి ప్రాజెక్టుల నీటి లభ్యత, విడుదల, పంటల సాగుపై చర్చించారు.ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలతో జూరాలకు కొంత నీరు చేరడంతో శ్రీశైలంలోనూ నిల్వలు పెరిగాయన్నారు. ప్రస్తుతం ఉన్న నీటితో సాగులో ఉన్న పంటలకు డిసెంబరు వరకు నీరు అందించాల్సి ఉందని, పూర్తిస్థాయిలో ఖరీఫ్‌కు నీరు అందాలంటే మరిన్ని వర్షాలు అవసరమని చెప్పారు. కాలువలపై ఆధారపడే రైతులు ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.జూరాలలో ప్రస్తుతం సుమారు 9 టీఎంసీల నీరు ఉందని, అందులో 7 టీఎంసీలు సాగునీటికి, 2 టీఎంసీలు తాగునీటికి వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు నీటి లభ్యతను అర్థం చేసుకుని పంటల ప్రణాళిక చేసుకోవాలని కోరారు.



## సింగరేణిలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలి

- **సమస్య పరిష్కారానికి సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద దీక్ష**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణిలో ప్రధాన సమస్యగా పిడిస్తున్న మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేయడం జరిగింది. సింగరేణిలో మారుపేర్లు విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి బాధితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట ప్రారంభమైన నిరవధిక నిరసన దీక్షకు ఐఎఫ్టీయూ నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జీఎల్బీకేఎస్ నాయకులు మాట్లాడుతూ పదకొండు ఏరియాల కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన మారుపేర్ల బాధితులు వారి కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా న్యాయం కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుండా కమిటీ పేరుతో కాలయాపన చేయడం బాధిత కుటుంబాలపై తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు.బాధితుల తల్లిదండ్రులు అనారోగ్య సమస్యలు మానసిక వేదనల మధ్య కూడా న్యాయం కోసం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట నిరవధిక దీక్షలో కూర్చోవడం అత్యంత బాధాకరమని ఐఎఫ్టీయూ నాయకులు పేర్కొన్నారు. బాధితులకు తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి మారుపేర్ల బాధితుల సంఘం అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ కూడా మాట్లాడారు. ఈ నిరవధిక నిరసన దీక్షకు ఐఎఫ్టీయూ పక్షాన జి.సంజీవరావు, నాగేశ్వరరావు, మోత్కూరి మల్లికార్జున, బి.వెంకటమ్మ, ఎల్. నరేష్, నాగమణి తదితర నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. బాధితుల న్యాయమైన పోరాటానికి ఐఎఫ్టీయూ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని వారు స్పష్టం చేశారు.



## బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పాదయాత్ర

**బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి**

**బెల్లంపల్లి ,మహా:** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపుమేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా బుధవారం రోజు బెల్లంపల్లి పట్టణంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన భగత్ సింగ్ విగ్రహం, అమరజీవి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి పూలమాలలు వేసిబిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పాదయాత్ర పోరు యాత్రను ప్రారంభించినట్లు పట్టణ సిపిఐ కార్యదర్శి ఆడేపు రాజమౌళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సిపిఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ లు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి దేశమంతట ప్రజలను చైతన్యపరచుటకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ,సార్వత్రికవిద్య ప్రజల ఆరోగ్యం గురించి వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలని, యువకులకు ఉపాధి కల్పించాలని, ధరల పెరుగుదల అరికట్టాలని పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని ,దళిత ఆదివాసీలపై ఆకృత్యాలను దాడులను నిలిపి వేయాలని, మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరీక్షించాలని ,అలాగే బెల్లంపల్లి పట్టణంలో రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయినవారికి వెంటనే వారికి ఉపాధి కల్పించాలని, బెల్లంపల్లి పట్టణము చుట్టూ ఉన్న ఖాళీ భూములను రియల్ ఎస్టేటర్ లు కబ్జాచేసి ప్లాట్లుగా అమ్మేస్తున్నారని ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి వెంటనే ఆపాలని, సక్రమంగా మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, బి కే యం యు జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాబు, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ తాండూరు మండల కార్యదర్శి కొల్లు బానేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోషం, బి కే యం యు జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొల్లం సోని, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, బొల్లం తిలకంబేడ్కర్, రత్నం రాజం, మేకల రాజేశం, మంతెన రమేష్, ఫిట్ కార్యదర్శిలు రత్నం ప్రవీణ్ కుమార్, వడ్డె మల్ల రాజేందర్, లక్ష్మీనారాయణ, జిల్లా ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు బొంకూర్ రామచందర్, నాయకులు జూపాక కొమురయ్య, బండారు శంకర్, అందుగుల రాజేందర్, స్వామి దాసు, కే తిరుపతి, చంద్రయ్య, నర్సింగ్, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ నేరాలు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు

- **విద్యార్థులు డ్రగ్స్ గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలి**
- **కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి**
- **ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి**
- **గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం**

ఇబ్రహీంపట్నం ఆగస్టు 12 మహా: ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, విజిబుల్ పోలీసింగ్ సైబర్ నేరాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇబ్రహీంపట్నం ఎస్ హెచ్ ఓ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణతో పాటు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవడం, అలాగే ర్యాగింగ్‌కు దూరంగా ఉండటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ మాట్లాడుతూ...విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన అన్నారు. పోటి విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలను కూడా విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలు లేదా ర్యాగింగ్‌కు సంబంధించిన ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**బెల్లంపల్లి, మహా:** కాసిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ బుధవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని వసతులు, విద్యార్థులకు అందుతున్న భోజనం, విద్యా సౌకర్యాలను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు.విద్యార్థినులతో స్వయంగా మాట్లాడిన ఎమ్మెల్యే "మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అందుతున్నదా? భోజనం నాణ్యత ఎలా ఉంది? చదువులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా? వసతులకు సంబంధించి ఏమైనా సమస్యలున్నాయా?" అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కొద్దిసేపు సరదాగా ముచ్చటించి వారి చదువు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. విద్యాలయంలో రూ.42 లక్షలు, రూ.53 లక్షల వ్యయంతో చేపడుతున్న డార్మిటరీ, అదనపు గదుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు తమకు పాఠశాల ఆటస్థలం ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉందని, గ్రౌండ్‌ను చదును చేసి మట్టి పోయించి ఆటలకు అనువుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, విద్యార్థినుల చదువుతో పాటు వారి ఆరోగ్యం, క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తాం. మీకు ఆటలు ఆడుకునేందుకు ఇబ్బంది లేకుండా గ్రౌండ్‌ను పరిశుభ్రంగా చేసి, అవసరమైన పనులు చేపించి ఆటలకు అనువుగా తీర్చిదిద్దేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చేయిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా నా దృష్టికి తీసుకురావాలి" అని అన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ రత్నం ప్రదీప్,తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## త్వరలో బెల్లంపల్లి, తాండూర్‌లలో 70 ఎకరాల్లో అర్బన్ పార్కుల ఏర్పాటు

- **బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకట స్వామితో అటవీ శాఖ అధికారుల చర్చలు**



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్కులను ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ అధికారులతో బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి తో చర్చలు జరిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్‌డీవో విజయ్, ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్‌లు ఎమ్మెల్యే ని కలిసి అర్బన్ పార్కుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు.బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పచ్చదనం పెంపొందించేలా అర్బన్ పార్కులను అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ ఉద్దేశంతో అధికారులు ఈ ప్రతిపాదనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడం జరిగింది . పార్కుల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, అభివృద్ధి చేపట్టాల్సిన విధానం తదితర అంశాలపై ఎమ్మెల్యే తో అధికారులు చర్చించారు.ఎమ్మెల్యే శ్రీ గడ్డం అర్బన్ పార్కుల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీంతో బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లో త్వరలోనే అర్బన్ పార్కుల ఏర్పాటుకు అనుకూలత ఏర్పడే అవకాశం ఉంది.అర్బన్ పార్కులు అందుబాటులోకి వస్తే పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనం, ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



## పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు చూపించాలి..

- **మౌలానా అబ్దుల్ కలాం యువజన సంఘం అధ్యక్షుడు మహమ్మద్ కరీం**

**మొయినాబాద్ మహా:** పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు చూపించి న్యాయం చేయాలని హిమాయత్ నగర్ అబ్దుల్ కలాం యువజన సంఘం అధ్యక్షుడు మహమ్మద్ కరీం అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూ లోగల సర్వేనంబర్ 151లో 2007 నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన 60 గజాల ఇళ్ల స్థలాల పట్టాదారులు రిలే దీక్ష చేపట్టారు. హిమాయత్ నగర్ యువజన సంఘాల అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న.. 60 గజాల బాధితుల రిలే దీక్ష బుధవారం 48వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ కలాం యువజన సంఘం అధ్యక్షుడు మహమ్మద్ కరీం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, పేదలకు ఇళ్ల స్థలాలను చూపించి న్యాయం చేయాలన్నారు. పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో మార్కెట్ యార్డు ఏర్పాటు చేయడం సరైనది కాదని ఆయన ఆరోపించారు. 60 గజాల పేదలు వారి హక్కు కోసం పోరాడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలను చూపించి ఇళ్లు నిర్మించుకునేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు న్యాయం చేయకుంటే రాష్ట వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిమాయత్ నగర్ యువజన సంఘాల అధ్యక్షులు కట్టమీది శ్రీను, కుమ్మరి విఠల్, కొర్ర గోపాల్ నాయక్, స్థానిక నాయకుడు షాబాద్ మాణిక్యం, ఇళ్ల స్థలాల లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం

**బెల్లంపల్లి ,మహా :** బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల ఏరియా ఆసుపత్రి ఆవరణలో తిలగ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని బుధవారంనాడు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు తో పాటు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ లో హాజరయ్యారు ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులతో పాటు మొక్కలను నాటి వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని, ఆహ్లాదకరమైన వాతావరణం మొక్కల పెంపకం తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మొక్కలను నాటిన అనంతరం పెంచడం వాటి సంరక్షణకు ట్రీ గార్డ్స్ కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాజ్ కుమార్, & పున్నం చందు, హాస్పటల్ సూపరిడెంట్ రవి, మున్సిపల్ అధికారులు సిబ్బంది & హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది పాల్గొనగాతిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రంగ రామన్న, కంటెవాడ నాగేష్ కుమార్,కజ్జం రమేష్, రత్నం ఐలయ్య, గెల్లీ జయరాం యాదవ్ రత్నం రాజన్న, భోగ శ్రీనివాస్,P రాజనర్స్, నాగుల లింగయ్య, భీముని కనకయ్యగౌడ్, కందుల సత్తయ్య, ఏనుగు నరేష్, పాంచాలపు శ్రీనివాస్, పుల్లూరి సత్యనారాయణ, ముత్తే వెంకట్ రాజం, తిప్పారపు రాజయ్య, తిప్ప శ్రీనివాస్, బాల ప్రశాంత్, కొయ్యడ శంకర్ గౌడ్, డోలి సుకుమార్ లు పాల్గొన్నారు.

## అటవీశాఖ లాంఛనాలతో ఉద్యోగి అంత్యక్రియలు

- **నివాళ్లు అర్పించిన కలెక్టర్, డీఎఫ్వో, ఎమ్మెల్యే**
- **ప్రభుత్వం ద్వారా త్వరితంగా బెనిఫిట్స్**



**కారేపల్లి, మహా:** విద్యుత్ తో అడవి జంతువుల వేటను అడ్డుకోవటానికి వెళ్లి వేటగాళ్లు పెట్టిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ అంత్యక్రియలు బుధవారం సింగరేణి మండలం వెంకట్యాతండాలో జరిగింది. సింగరేణి మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్, వెంకిట్యాతండా సర్పంచ్ బానోత్ బూలీ ల చిన్న కుమారుడైన నవీన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రేంజ్ పరిధిలోని చెరువు సింగారం వేస్ట్ బీట్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం అక్కడి బదిలీ కావటం అక్కడ విధి నిర్వాహణలో మృతి చెందటంతో మండలంలో విషాధచ్ఛాయలు నెలకొన్నాయి. మృతదేహాన్ని ఖమ్మం జిల్లా కలెక్రట్ దివాకర టీ.ఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్వో సిదార్ధ విక్రమ్ సింగ్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సందర్శించి నివాళ్లు అర్పించారు. విధి నిర్వాహణలో మృతి చెందిన నవీన్ కుటుంబానికి అన్ని విధాల అదుకుంటామని అధికారులు, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా, అటవీశాఖ ద్వారా అందాల్సిన బెనిఫిట్స్ ను త్వరితగతిన అందేలా చూడాలని, విధి నిర్వాహణలో మృతి చెందితే రూ.కోటి ఇస్తామన్నా సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కుటుంబ సభ్యులు వివిధ పార్టీలనాయకులు డిమాండ్ చేశారు.

కారేపల్లిలో భారీ ఊరేగింపుభద్రాచలం నుండి ఫారెస్టు బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ మృతదేహం కారేపల్లి తీసుకవస్తున్న సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. యువకులు అధిక సంఖ్య పాల్గొని తోటి మిత్రునికి నివాళ్లు ఆర్పించారు. భ్రదాచలం అసుప్రతిలో నవీన్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సందర్శించి నివాళ్లు ఆర్పించారు. మృత దేహాన్ని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పగడాల మంజుల, బానోత్ రాంమ్మూర్తి, మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు, అడ్డగోడ ఐలయ్య, పెద్దబోయిన ఉమాశంకర్, గుడిపుడి తిరుమలరావు, గుగులోత్ భీముడు, కడియాల సుధాకర్, ఈసాల నాగేశ్వరరావు, వాంకుడోత్ గోపాల్, సర్పంచ్ లు భూక్య రంజిత్, బానోత్ హీరాలాల్, మేదరి వీర్రపతాప్, పొదుగు పెంటయ్య, ఈసాల వెంకటేశ్వర్లు, కల్తి భద్రయ్య, దారావత్ మంగీలాల్, బీఆర్ఎస్ నాయకులు ముత్యాల సత్యనారాయణ, అడపా పుల్లారావు, లాకావత్ లక్ష్మన్, వాంకుడోత్ జగన్, సీపీఎం నాయకులు కొండెబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర తదితరులు ఉన్నారు.



## ఆదిభట్ల సర్కిల్లో భూ అక్రమార్కులపై ఉక్కుపాదం.?

- **బొంగుళూరు ఇందిరమ్మ కాలనీలో అధికారుల విచారణ**
- **భూ అక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు**
- **ఒక రిపోర్టర్ ప్రభుత్వ ఉద్యోగులు కలిసి భూ అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్తుల ఆరోపణ.?**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 12 మహా:** బొంగుళూరు ఇందిరమ్మ కాలనీ సర్వే నంబర్ 11లో ఒక రిపోర్టర్ ప్రభుత్వ ఉద్యోగులు కలిసి భూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ... భూములు, ప్లాట్ల వ్యవహారంపై గ్రామ ప్రజలు, కాలనీ వాసులు, స్థానికుల ఫిర్యాదులతో అధికారులు విచారణ చేపట్టారు.

**విచారణలో కీలక విషయాలు....**

విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.. యాచారం మండలానికి చెందిన ఒక రిపోర్టర్‌కు సంబంధించిన ఐదు ప్లాట్లు బినామీ పేర్లతో బొంగులూరు ఇందిరమ్మ కాలనీలో ఉన్నట్లు తేలింది.? రైతులను మభ్యపెట్టి, అప్పటి అధికారులను ప్రభావితం చేసి కోట్ల రూపాయల విలువైన భూములను దక్కించుకున్నారనే ఆరోపణలపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. అప్పటి రెవెన్యూ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు బినామీ పేర్లతో భూ ఆక్రమాలకు పాల్పడినట్లు గ్రామస్తులు అధికారులను కోరడంతో విచారణ చేస్తామని తెలిపినట్లు తెలిపారు.?

**బినామీ పేర్లతో ఉన్నప్లాట్ల రికార్డుల పరిశీలన...**

బినామీ పేర్లతో ఉన్నప్లాట్లకు సంబంధించిన రికార్డులు, పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అక్రమ ప్లాట్ల కేటాయింపులు, సంబంధిత పత్రాలపై సమగ్ర విచారణ కొనసాగుతోంది. అక్రమంగా ప్రభుత్వ లేదా పేదల భూములను ఆక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు...**

బుధవారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని బొంగుళూరు ఇందిరమ్మ కాలనీలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రమేష్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇక ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, రైతుల భూములు, పేదల ప్లాట్ల విషయంలో అక్రమాలకు పాల్పడితే ఎంతటి పలుకుబడి ఉన్నా ఉపేక్షించకూడదనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. బొంగుళూరు సర్వే నంబర్ 11 వ్యవహారంలో అధికారులు చేపట్టిన విచారణతో అప్పటి రెవెన్యూ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు బినామీ పేర్లతో భూ ఆక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన అధికారులు? మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.





# ‘ఐ యామ్ గేమ్’ రిలీజ్‌పై సస్పెన్స్

సౌత్ సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం ఓ కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. భారీ అంచనాలతో విడుదల తేదీలు ప్రకటించిన సినిమాలు.. చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తికాక వాయిదా పడుతున్నాయి. తాజాగా దుల్కర్ సల్మాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ ‘ఐ యామ్ గేమ్’ కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొనే అవకాశం ఉందనే చర్చ మాలీవుడ్‌లో మొదలైంది. ఆగస్టు 20, 2026న ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో విడుదల తేదీ మారే అవకాశాలున్నాయనే ప్రచారం జరుగుతోంది.

ఐ యామ్ గేమ్ రిలీజ్ వాయిదా పడితే.. అది కేవలం ఆ సినిమా విడుదలకే పరిమితం కాదు. మాలీవుడ్ బాక్సాఫీస్ లెక్కలపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. ఒకప్పుడు రిలీజ్ డేట్ ప్రకటించిన తర్వాత దానిని మార్చడం చాలా అరుదుగా ఉండేది. కానీ ప్రస్తుతం యాక్షన్ థ్రిల్లర్లు, విజువల్ ఎఫెక్ట్స్ ఉన్న చిత్రాలు, బహుభాషా విడుదలలు పెరగడంతో పోస్ట్ ప్రొడక్షన్ ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. డబ్బింగ్, డీఐ, సౌండ్ డిజైన్, వీఎఫ్ఎక్స్, సెన్సార్ వంటి పనులను సమన్వయం చేయడంలో ఆలస్యం కారణంగా చివరి దశలో విడుదల తేదీలను మార్చాల్సిన పరిస్థితి వస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సినిమా వాయిదా పడితే అదే సమయంలో విడుదలకు సిద్ధమవుతున్న పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ‘ఖలీఫా’కు భారీగా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. పోటీ తగ్గడంతో ఆ సినిమాకు ఎక్కువ థియేటర్లు, స్క్రీన్లు లభించడంతో పాటు ఓపెనింగ్స్ కూడా పెరిగే అవకాశాలు ఉంటాయి. మరోవైపు మమితా బైజు నటించిన ‘బేతేళం కుడుంబ’ చిత్రానికి కూడా మల్టీప్లెక్స్ పోటీ కొంత తగ్గవచ్చు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్న ఈ సినిమాకు ఎక్కువ షేర్ దక్కే అవకాశాలు ఏర్పడతాయి.

దీంతో ఆగస్టు 20న మాలీవుడ్ బాక్సాఫీస్ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. మూడు సినిమాల మధ్య జరగాల్సిన పోటీ.. రెండు చిత్రాల మధ్య ప్రధాన పోటీగా మారవచ్చు. ఈ పరిణామం డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, థియేటర్ చైన్లపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా స్క్రీన్ కేటాయింపులు, షోలు, ఓపెనింగ్ కలెక్షన్ల విషయంలో మార్పులు రావచ్చు.ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో సినిమాలను విడుదల చేయాలనే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ఒకేసారి మలయాళం, తెలుగు, తమిళం, హిందీ మార్కెట్లను టార్గెట్ చేయడంతో ప్రతి భాషా వెర్షన్‌ను ఒకే స్థాయిలో సిద్ధం చేయాల్సి వస్తోంది. డబ్బింగ్ నుంచి సౌండ్ మిక్సింగ్ వరకు ప్రతి పని పూర్తయిన తర్వాతే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నారు. దీంతో రిలీజ్ డేట్ కంటే సినిమా క్వాలిటీకి ప్రాధాన్యం ఇస్తూ చివరి నిమిషంలోనూ నిర్ణయాలు మార్చుకునే పరిస్థితి ఏర్పడుతోంది.

‘ఐ యామ్ గేమ్’ వాయిదాపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ సినిమా చుట్టూ జరుగుతున్న చర్చలు ఆసక్తిని పెంచుతున్నాయి. భారీ బడ్జెట్ సినిమాల విషయంలో పోస్ట్ ప్రొడక్షన్ ఇప్పుడు కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాకుండా.. సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు రావాలనే విషయాన్ని నిర్ణయించే కీలక దశగా మారుతున్నట్లు ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

# వెకేషన్ లుక్‌లో మానుషి చిల్లర్ మెరుపులు



బీచ్ వెకేషన్‌లో సేదతీరుతూ తన అందాలతో అభిమానులను ఆకట్టుకుంటోంది మాజీ విశ్వసుందరి మానుషి చిల్లర్. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన వెకేషన్ ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రశాంతమైన సముద్రతీరం, చుట్టూ పచ్చని కొబ్బరి చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య మానుషి తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేకంగా నిలిచింది.తాజా ఫొటోల్లో మానుషి పాస్టెల్ రంగుల టైడై డిజైన్ ఉన్న బికినీ టాప్‌తో పాటు అదే తరహా హైవెయిస్ట్ షార్ట్స్ ధరించింది. సింపుల్‌గా, అదే సమయంలో ట్రెండీగా కనిపించే ఈ దుస్తులు ఆమె వెకేషన్ స్టైల్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. తలపై స్టైలిష్ స్ట్రా ఫెడోరా టోపీ, కళ్లకు చిక్ సన్‌గ్లాసెస్, మెడలో సున్నితమైన గోల్డ్ లేయర్డ్ నెక్లెస్ ధరించి మానుషి తన లుక్‌ను పూర్తి చేసింది. సూర్యకాంతిలో మెరిసిపోతున్న మానుషి ఫొటోల్లో ఎంతో ఉల్లాసంగా, ఆత్మవిశ్వాసంగా కనిపిస్తోంది. ఎలాంటి హంగామా లేకుండా సహజమైన చిరునవ్వుతో ఇచ్చిన పోజులు ఫొటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ట్రావెల్, ఫ్యాషన్ రెండింటినీ ఇష్టపడే వారికి ఆమె తాజా లుక్ ప్రత్యేకంగా ఆకట్టుకునేలా ఉంది. సాధారణ వెకేషన్ దుస్తులను కూడా స్టైలిష్‌గా ఎలా మార్చుకోవచ్చో మానుషి తన లుక్ ద్వారా చూపించింది.

మానుషి చిల్లర్ తొలుత అందాల పోటీల ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. విశ్వసుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్న తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టింది. చారిత్రక నేపథ్యంతో తెరకెక్కిన ‘సామ్రాట్ పృథ్వీరాజ్’ చిత్రంతో కథానాయికగా తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించింది. తొలి చిత్రంతోనే బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత విభిన్న కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనా పరిధిని విస్తరించుకుంటోంది. కామెడీ నేపథ్యంతో తెరకెక్కిన ‘ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ’లోనూ నటించి ప్రేక్షకులను అలరించింది. అనంతరం యాక్షన్ ప్రధానమైన చిత్రాల్లోనూ కనిపిస్తూ తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసింది. ‘ఆపరేషన్ వాలెంటైన్’, ‘బడే మియాన్ చోటే మియాన్’ వంటి యాక్షన్ చిత్రాల్లో మానుషి నటించింది. భారీ యాక్షన్ సన్నివేశాలు, కమర్షియల్ కథాంశాలతో తెరకెక్కిన సినిమాల్లో నటిస్తూ తన కెరీర్‌ను విభిన్నంగా మలుచుకుంటోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా ఎంచుకోవడం ద్వారా నటిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవల ‘మాలిక్’, ‘తెహ్రాన్’ వంటి విభిన్నమైన ప్రాజెక్టుల్లోనూ మానుషి భాగమైంది. యాక్షన్, థ్రిల్లర్, స్పై డ్రామా వంటి విభిన్న జానర్లలో నటిస్తూ బాలీవుడ్‌లో తన స్థాయిని మరింత పెంచుకునే దిశగా ముందుకు సాగుతోంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ మానుషికి భారీగా అభిమానులున్నారు. ఫ్యాషన్, ట్రావెల్, ఫిట్‌నెస్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆమె తరచూ అభిమానులతో పంచుకుంటుంది. ముఖ్యంగా వెకేషన్ ఫొటోషూట్లు, స్టైలిష్ దుస్తుల్లోని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంటాయి. తాజా బీచ్ వెకేషన్ ఫొటోల్లోనూ మానుషి తన సహజమైన అందంతో పాటు ఫ్యాషన్ సెన్స్‌ను ప్రదర్శించింది. పాస్టెల్ రంగుల దుస్తులు, బంగారు ఆభరణాలు, సన్‌గ్లాసెస్, స్ట్రా టోపీ కలయిక ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తంగా వెండితెరపై విభిన్న పాత్రలతో అలరిస్తూనే, సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫొటోలతోనూ అభిమానులను ఆకట్టుకుంటోంది మానుషి చిల్లర్.

# రుక్మిణీ వసంత్.. వరుస పాన్ ఇండియా అవకాశాలు

కన్నడ సినీ పరిశ్రమ నుంచి హీరోయిన్‌గా పరిచయమైన రుక్మిణీ వసంత్.. తన నటన, అందం, క్యూట్ లుక్స్‌తో దక్షిణాది ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం కన్నడతో పాటు తమిళం, హిందీ చిత్రాల్లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ భామ.. ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా రుక్మిణీ వసంత్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ‘జయ జయ జయ జయ హే’ వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు నషిద్ ఫామి ఈ సినిమాను రూపొందించనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌తో రుక్మిణీ వసంత్ దక్షిణాదిలోని ప్రధాన సినీ పరిశ్రమలన్నింటిలోనూ తన మార్క్ చూపించే దిశగా అడుగులు వేస్తోంది.ప్రస్తుతం రుక్మిణీ చేతిలో వరుసగా భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్’లో ఆమె కీలక పాత్ర పోషిస్తోంది. మరోవైపు యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ‘డ్రాగన్’ చిత్రంలోనూ రుక్మిణీ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భారీ ప్రాజెక్టులు ఆమె కెరీర్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చే అవకాశం ఉంది.ఇక టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ‘ఆర్‌సీ 1’లో కథానాయికగా రుక్మిణీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.ఒకవేళ ఈ వార్త నిజమై, రుక్మిణీ వసంత్ ‘ఆర్‌సీ 1’లో హీరోయిన్‌గా ఖరారైతే.. రామ్‌చరణ్‌తో ఆమెకు ఇదే తొలి కాంబినేషన్ అవుతుంది. ఇప్పటికే వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్న ఆమెకు ఈ అవకాశం దక్కితే కెరీర్ మరింత వేగంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది.భాషతో సంబంధం లేకుండా వరుసగా పెద్ద చిత్రాల్లో అవకాశాలు అందుకుంటున్న రుక్మిణీ వసంత్.. ప్రస్తుతం సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల జాబితాలోకి వేగంగా చేరుతోంది. కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలతో పాటు భారీ కమర్షియల్ చిత్రాల్లోనూ నటిస్తూ తన పరిధిని విస్తరించుకుంటోంది. ఇదే జోరు కొనసాగితే రాబోయే రోజుల్లో దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా రుక్మిణీ వసంత్ ఎదిగే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.





# పదేళ్లయిన యష్–రాధికా ప్రేమబంధం

కొన్ని ప్రేమకథలు కాలం గడిచేకొద్దీ మరింత అందంగా మారుతుంటాయి. సినిమా రంగంలో పరిచయమైన ఇద్దరు వ్యక్తులు జీవిత భాగస్వాములుగా మారి, కుటుంబాన్ని నిర్మించుకోవడంతో పాటు ఒకరి కెరీర్‌కు మరొకరు అండగా నిలవడం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. కన్నడ స్టార్ యష్, నటి రాధికా పండిట్ జంట కూడా అలాంటి అందమైన ప్రేమకథకు ఉదాహరణగా నిలుస్తోంది. తాజాగా తమ నిశ్చితార్థానికి పదేళ్లు పూర్తైన సందర్భంగా రాధికా పండిట్ చేసిన ప్రత్యేక పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.2016 ఆగస్టు 12న యష్, రాధికా పండిట్ నిశ్చితార్థం జరిగింది. ఈ ప్రత్యేక రోజుకు పదేళ్లు పూర్తైన సందర్భంగా రాధికా తమ ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన కొన్ని అరుదైన దృశ్యాలను వీడియో రూపంలో అభిమానులతో పంచుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను మరోసారి గుర్తుచేసుకున్న ఆమె.. పదేళ్లుగా కొనసాగుతున్న తమ అనుబంధంపై భావోద్వేగపూరితమైన సందేశాన్ని కూడా రాశారు. తమ ప్రేమ ప్రయాణం ఇప్పటికీ అదే అందంతో కొనసాగుతోందనే భావాన్ని ఆమె తన పోస్టులో వ్యక్తం చేయడంతో అభిమానులు ప్రేమగా స్పందిస్తున్నారు.సినిమాలతోనే మొదలైన పరిచయంయష్, రాధికా పండిట్‌ల పరిచయం కూడా సినీ రంగంతోనే మొదలైంది. తొలుత టెలివిజన్ కార్యక్రమాల ద్వారా ఒకరికొకరు పరిచయమైన వీరిద్దరూ ఆ తర్వాత కన్నడ చిత్రాల్లో కలిసి నటించారు. ‘మొగ్గిన మనసు’, ‘డ్రామా’, ‘మిస్టర్ అండ్ మిసెస్ రామాచారి’ వంటి చిత్రాల్లో జంటగా కనిపించి ప్రేక్షకులను అలరించారు. కలిసి పనిచేసే సమయంలో ఏర్పడిన స్నేహం క్రమంగా ప్రేమగా మారింది.ఆ ప్రేమకు 2016లో నిశ్చితార్థంతో అధికారిక ముద్ర పడింది. అనంతరం బెంగళూరులో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వివాహం చేసుకున్న ఈ జంట.. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఐరా, యాతర్వ్‌తో కలిసి ఆనందంగా కుటుంబ జీవితాన్ని కొనసాగిస్తున్నారు.సినిమా కెరీర్‌లోనూ యష్ తనదైన గుర్తింపును సంపాదించుకుంటూ పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. మరోవైపు రాధికా పండిట్ కూడా నటిగా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇద్దరూ తమ తమ కెరీర్‌లలో బిజీగా ఉన్నప్పటికీ కుటుంబానికి సమయం కేటాయిస్తూ ముందుకు సాగుతున్నారు.పదేళ్ల క్రితం మొదలైన నిశ్చితార్థం జ్ఞాపకాలను రాధికా మరోసారి అభిమానులతో పంచుకోవడంతో.. యష్-రాధికా జంటపై అభిమానుల్లో మరోసారి ప్రేమ, అభిమానం వెల్లువెత్తుతోంది. తమ అనుబంధం కాలంతో పాటు మరింత బలపడుతోందని ఈ జంట తమ ప్రయాణం ద్వారా చూపిస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com